

లెక్కలేనంత..!

మిల్లుల్లో భారీగా రేషన్ బియ్యం నిల్వ



రేషన్ బియ్యం నుంచి సన్నబియ్యం తయారీని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఏఎస్పీ

- 210 టన్నుల మేర తరలింపు..
- ఇంకా పెద్ద మొత్తంలో బస్తాలు
- తేలని లెక్క

యాడికి, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): రైస్‌మిల్లుల్లో రేషన్ బియ్యం నిల్వలు గుట్టలుగా బయటపడుతున్నాయి. యాడికిలో రేషన్ బియ్యం లెక్కలు కొలిక్కి రాలేదు. యాడికిలోని రైస్‌మిల్లుల్లో పెద్దఎత్తున నిల్వ ఉన్న రేషన్ బియ్యాన్ని ఆదివారం పోలీసులు, రెవెన్యూశాఖ అధికారులు సీజ్‌చేసిన సంగతి తెలిసిందే. ఆ బియ్యాన్ని సోమవారం లారీల్లో గుంతకల్లు పౌరసరఫరాల బఫర్ గోడౌన్‌కు తరలించారు. 7 లారీలు, బొలెరో వాహనంలో సుమారు 210 టన్నుల రేషన్ బియ్యాన్ని తరలించారు. రైస్‌మిల్లుల్లో ఇంకా పెద్దమొత్తంలో రేషన్ బియ్యం నిల్వలు ఉన్నాయనీ, వీటన్నింటిని తరలించడానికి మరో 24గంటలు పట్టవచ్చని అధికారులు చర్చించుకుంటున్నారు. పూర్తిగా తరలిస్తే తప్ప.. ఎంత సీజ్ చేసినదీ చెప్పలేమని వారు పేర్కొంటున్నారు. రైస్‌మిల్లు వద్ద పెద్దఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసు పహారా నడుమ బియ్యాన్ని గుంతకల్లు పౌరసరఫరాల గోడౌన్‌కు తరలిస్తున్నారు. పరిస్థితిని సోమవారం ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి పర్యవేక్షించారు. ఇంత పెద్దమొత్తంలో ఎలా నిల్వ చేశారు, దీనివెనుక ఎవరెవరు ఉన్నారని వివరాలను ఆరాతీశారు. యాడికి తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్, పలువురు వీఆర్వోలు రైస్‌మిల్లు వద్ద ఉండి రేషన్ బియ్యం తరలింపునకు చర్యలు చేపడుతున్నారు.

సన్నబియ్యంగా మార్చి..

వివిధ ప్రాంతాల నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి, యాడికిలోని రైస్‌మిల్లులో సన్నబియ్యంగా మారుస్తున్నట్లు అధికారులు అంచనాకు వచ్చారు. ఆ బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించి, అక్కడి వ్యాపారులకు విక్రయిస్తున్నట్లు సమాచారం. కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు స్థానికంగా చర్చించుకుంటున్నారు.

కిలో రేషన్ బియ్యం రూ.17 నుంచి రూ.19

రేషన్ లబ్ధిదారుల నుంచి అక్రమంగా వ్యాపారం చేసేవారు కిలో బియ్యం రూ.17 నుంచి రూ.19కి కొనుగోలు చేస్తున్నారు. వీటిని యాడికిలోని రైస్‌మిల్లులో రూ.21 నుంచి రూ.23కి విక్రయిస్తున్నారు. వారు వీటిని ముడి సరుకుగానే కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు రూ.33కి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు. రేషన్ బియ్యాన్ని సన్నబియ్యంగా మార్చి కిలో రూ.45 నుంచి రూ.50 చొప్పున విక్రయిస్తున్నట్లు సమాచారం. ప్రతినెలా రేషన్ దుకాణాల్లో బియ్యం పంపిణీ మొదలైనప్పట్నుంచి 15వ తేదీ వరకు రేషన్ బియ్యం అక్రమ కొనుగోళ్లు జరుగుతుంటాయి. ఇదే వృత్తిగా మార్చుకున్న కొందరు వ్యక్తులు రేషన్ బియ్యం విక్రయించే వ్యక్తుల ఇళ్ల వద్దకు వెళ్లి కొనుగోలు చేసి, ఒకచోట నిల్వ చేసుకుంటారు. వాటిని రాత్రివేళల్లో వివిధరకాల వాహనాల్లో రైస్‌మిల్లుకు తరలిస్తుంటారని స్థానికులు చర్చించుకుంటున్నారు.

అంగన్‌వాడీ బియ్యం కూడా..

అంగన్‌వాడీ కేంద్రాల్లో టేక్ హోం రేషన్‌లో భాగంగా పంపిణీ చేసిన సార్టెక్స్ పోర్టిఫైడ్ బియ్యం ప్యాకెట్లు కూడా రైస్‌మిల్లులో లభించడంపై అధికారులు విస్తుపోతున్నారు. అవి రేషన్ దుకాణాల నుంచి వచ్చాయా? అంగన్‌వాడీ కేంద్రాల నుంచి (మిగతా 6లో..)

సంజీవని..!

- గోల్డన్ అవర్‌లో ప్రాణాలు నిలుపుతున్న ఇంజక్షన్
- ప్రభుత్వాస్పత్రిలో అందుబాటులోకి..



గుండెను పరీక్షించే అధునాతన యంత్రం, ఇంజక్షన్‌ను చూపుతున్న డాక్టర్ ఎల్లప్ప

గుత్తి, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): గుండె నొప్పితో ప్రాణాపాయంతో ఆస్పత్రికి వచ్చే వారిని సూది మందుతో కాపాడుతున్నారు. ఖరీదైన ఇంజక్షన్ వేస్తూ ప్రాణాలు నిలుపుతున్నారు ప్రభుత్వ వైద్యులు. ఇలా గుత్తిలోని ప్రభుత్వాస్పత్రిలో పదుల సంఖ్యలో గుండె నొప్పితో గోల్డెన్ అవర్‌లో వచ్చిన వారి ప్రాణాలను కాపాడారు. మారుమూల ప్రాంతాలవారికి గుండెనొప్పి వస్తే వైద్యసేవలు అందుబాటులోలేక మృతి చెందే వారు. ఈ ముప్పు నుంచి తప్పించేందుకు ప్రభుత్వం విలువైన ఇంజక్షన్‌ను అందుబాటులోకి తెచ్చింది. స్థానిక కమ్యూనిటీ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో టెనెక్ ఇంజక్షన్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. గుండెపోటు వచ్చిన వెంటనే ఆస్పత్రికి తీసుకొస్తే వైద్యులు ఈసీజీ తీసి, నివేదికను అనంతపురంలోని ప్రభుత్వ గుండె వైద్య నిపుణులకు వాట్సాప్ ద్వారా పంపుతారు. అక్కడి వైద్యులు పరిశీలించి ఇంజక్షన్ వేయాలా.. మందులు ఇస్తే సరిపోతుందా అని సూచిస్తారు. ఆ మేరకు స్థానిక వైద్యులు పరీక్షలు చేస్తారు. ఆస్పత్రిలో ఇప్పటి వరకు 33 మంది రోగులకు ఈ ఇంజక్షన్ ఇచ్చినట్లు వైద్యాధికారి ఎల్లప్ప తెలిపారు. వారిలో 9 మంది మృతిచెందగా.. మిగిలిన వారు ఆరోగ్యంగా ఉన్నారన్నారు. రూ.43 వేల విలువచేసే ఈ ఇంజక్షన్ ప్రభుత్వాస్పత్రిలో అందుబాటులో ఉందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రజా సమస్యలపై తక్షణం స్పందించండి: ఎస్పీ

అనంతపురం క్రైం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పోలీసు స్టేషన్లకు వచ్చే ప్రజలకు సంబంధించిన సమస్యలపై తక్షణం స్పందించాలని పోలీసు అధికారులను ఎస్పీ జగదీష్ ఆదేశించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. కుటుంబ కలహాలు, భర్త, అత్తింటి వేధింపులు, భూమి, ఆస్తి తగాదాలు, ఇతర సమస్యలతో వచ్చిన ప్రజలు ఎస్పీ దగ్గర విన్నవించుకున్నారు. మొత్తం 74 ఫిర్యాదులు వచ్చాయి. వీటిపై ఎస్పీ జగదీష్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడారు. అర్జీలపై తక్షణం స్పందించి, చట్టపరిధిలో విచారణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ మహబూబ్ బాషా ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ జగదీశ్

వేపచెర్ల వద్ద మావోయిస్టు డంప్

భారీగా మందుగుండు సామగ్రి లభ్యం



డంప్‌ను వెలికితీయిస్తున్న పోలీసు అధికారి

అనంతపురం క్రైం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): చాలాకాలం తరువాత జిల్లాలో మావోయిస్టు డంప్ బయటపడింది. భూమిలో పాతిపెట్టిన జిలెటిన్ స్టిక్స్, బుల్లెట్లు, బాంబులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆత్మకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ డంప్ బయటపడింది. కానీ పోలీసు ఉన్నతాధికారులు దీనిపై పెదవి విప్పడం లేదు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆత్మకూరు మండలం వేపచెర్ల గ్రామ సరిసరాల్లో ఈ ఆయుధ నిల్వలను గుర్తించారు. ఓ రైతు పశువులను మేత కోసం అడవికి తీసుకెళ్లినప్పుడు వీటిని చూశాడు. అడవిలోని ఓ చెట్టు సమీపంలో డంప్‌కు సంబంధించిన వైర్లను చూసిన రైతు.... పోలీసులకు సమాచారం ఇచ్చారు. గతంలో రామగిరి, కనగానపల్లి, సీకే పల్లి, ఆత్మకూరు, పెనుకొండ ప్రాంతాల్లో భారీగా మావోయిస్టుల కదలికలు ఉండేవి. అప్పట్లో మావోయిస్టులు వీటిని దాచి ఉంటారన్న అభిప్రాయం వ్యక్తమౌతోంది. సుమారు పదేళ్ల నుంచి రాయలసీమ ప్రాంతంలో మావోయిస్టు అలికిడి లేదు. ఇన్నేళ్ల తరువాత ఉన్నఫలంగా డంప్ బయటపడటం అనేక అనుమానాలకు తావిస్తోంది.

నాకు నమ్మకం లేదు దొరా..!

- నా భార్య చనిపోతేనే పట్టించుకోలేదు
- సాక్ష్యాలను ఇస్తే మాయం చేశారు
- నాపైనే కేసు పెడతామని బెదిరించారు
- పోలీసు బాధితుడు.. ప్రవీణ్ ఆవేదన
- బుక్కరాయసముద్రంలో దగ్ధమైన బేకరీ



ప్రవీణ్

పొట్ట చేతబట్టుకుని రాష్ట్రం విడిచి వచ్చారు. చిన్నపాటి బేకరీ పెట్టుకుని పొట్టుపోసుకునే వారు. ఆ ఇంటి మహిళపై ఓ వ్యాపారి కన్ను పడింది. వేధింపులు భరించలేక ఆమె ఆత్మహత్య చేసుకుంది. ఇది జరిగి సుమారు ఐదు నెలలు. ఇంతలోనే వారి బేకరీ మంటల్లో తగలబడిపోయింది. 'అయ్యో పాపం..' అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. 'పోలీసులకు ఫిర్యాదు చేశారా..?' అని బాధితుడిని అడిగితే.. 'నాకు వారిపై నమ్మకం లేదు..' అని నిర్వేదంతో అన్నారు. నా భార్య చావుకు కారణమైన వ్యక్తిపై చర్యలు తీసుకోలేదు. ఆధారాలు ఇచ్చినా స్పందించలేదు. పైగా నేను మందలించినందుకే తాను ఆత్మహత్య చేసుకుందని ఎదురుదాడికి దిగారు. ఇంతటితో వదిలేయకుంటే నాపైనే కేసు పెడతామని బెదిరించారు అని వాపోయాడు. బుక్కరాయసముద్రం సమీపంలో బేకరీ నిర్వహిస్తున్న ప్రవీణ్ దీన గాథ ఇది. కర్ణాటకకు చెందిన ప్రవీణ్.. భార్యను, ఆస్తిని పోగొట్టుకుని ఇద్దరు బిడ్డలతో రోడ్డున పడ్డారు. అగ్నిప్రమాదంపై పోలీసులకు ఫిర్యాదు చేయడం ఇష్టంలేక, తహసీల్దారుకు అర్జీ ఇచ్చారు. ఆదుకోవాలని విన్నవించారు.

(వివరాలు 6లో)

ఊ అంటే వాన..!

- పంట పొలాల్లో నిలిచిన నీరు
- పలు ప్రాంతాల్లో కూలిన మిద్దెలు
- మరో మూడు రోజులు భారీ వర్షాలు



కూడేరు సమీపంలో వానలోనే కూలీల ప్రయాణం

(న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. వదిలి వదిలి వానలు కురుస్తుండటంతో మట్టి మిద్దెలు తడిసి కూలిపోతున్నాయి. రెవెన్యూ అధికారులు పరిశీలించి, నివేదికను ఉన్నతాధికారులకు పంపుతున్నారు. పంట పొలాల్లో భారీగా నీరు నిల్వ ఉంటోంది. దీంతో పంట దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి జిల్లాలో రానున్న మూడు రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ శాస్త్రవేత్త గుత్తానారాయణ స్వామి సోమవారం తెలిపారు. అక్కడక్కడ గాలివానతో కూడిన వర్షం, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని అన్నారు. పలుచోట్ల పిడుగులు పడే ప్రమాదం ఉందని, రైతులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. పశువులు, గొర్రెలను రేకుల షెడ్లు, చెట్ల కింద ఉంచకుండా, సురక్షిత ప్రాంతాల్లో ఉంచాలని సూచించారు. భారీ వర్షం ఉన్న నేపథ్యంలో రైతులు పంట పొలాల్లో ఉన్న నీటిని బయటకు తీసివేయాలని సూచించారు. మొక్కజొన్న, వరి, కూరగాయల సాగు, నేల తయారీ పనులను వాయిదా వేసుకోవాలని సూచించారు. పంట దిగుబడులను సురక్షిత ప్రాంతాల్లో ఉంచుకోవాలని సూచించారు.

నార్పలలో భారీ వర్షం

అనంతపురం జిల్లాలోని 27 మండలాల్లో ఆదివారం వర్షం కురిసింది. అత్యధికంగా నార్పలలో 8.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. యల్లనూరులో 8.2, శింగనమల 3.0, పెద్దవడుగూరు 2.9, ఉరవకొండ 2.7, తాడిపత్రి 2.4, గార్లదిన్నె 2.2, పామిడి 2.0, గుత్తి 1.9, రాప్తాడు 1.8, పుట్లూరు 1.4, కూడేరు 1.3,అనంతపురం, పెద్దపప్పూరు 1.2, ఆత్మకూరు, బుక్కరాయసముద్రం 1.1 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో ఒక సెంటీ మీటరు లోపు వర్షపాతం నమోదైంది. యల్లనూరు (మిగతా 6లో...)

డీఎస్సీ మార్కులు విడుదల

వివరాలు 6లో..

టీచర్లకూ పరీక్షే..!

- కొత్త నిబంధనలతో ఉక్కిరిబిక్కిరి
- ఎఫ్ఏ-1 పరీక్షతో ఉపాధ్యాయుల అగచాట్లు



విద్యార్థులకు ఆన్సర్ బుక్‌లెట్స్ అందజేస్తున్న టీచర్

అనంతపురం విద్య, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ పరీక్షల నిర్వహణలో తీసుకొచ్చిన కొత్త విధానం టీచర్లు, పిల్లలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఆ పరీక్ష రాయడానికి గంట సమయం ఇచ్చారు. అయితే బుక్‌లెట్, ఓఎంఆర్ షీట్‌లలో ఇచ్చిన నిబంధనల మేరకు సమాచారం రాయడానికి కూడా ఈ సమయం సరిపోదని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొలిరోజు ఎఫ్ఏ-1 పరీక్ష నిజంగానే టీచర్లు, పిల్లలకు పరీక్షగానే మారింది. పరీక్ష మొదలు కాగానే బుక్‌లెట్ పిల్లలకు ఇవ్వగా ప్రతి విద్యార్థితో అందులో పేరు, క్లాస్, సెక్షన్, రోల్ నెంబరు, స్కూల్ నేమ్, పెన్‌ఐడీ రాయించాలి. ప్రశ్నాపత్రంలో మల్టిపుల్ చాయిస్ టిక్ పెట్టుకొని బుక్‌లెట్‌లో ఆన్సర్లు రాయాలి. ఓఎంఆర్ షీట్‌లో పెన్‌ఐడీ, ఎగ్జామ్ కోడ్ రాసిన తర్వాత బబ్లింగ్ చేయాలి. బుక్‌లెట్‌లో రాసిన సమాధానాలు చూసి ఓఎంఆర్ షీట్‌లో బబ్లింగ్ చేయాలి. ఆతర్వాతనే పిల్లలు బుక్‌లెట్‌లో ప్రశ్నలకు సమాధానాలు రాయాలి. ఈతతంగం అంతా విద్యాశాఖ ఇచ్చిన నిబంధనల మేరకు ఓ గంటలో పరీక్ష ముగించాలి. 6,7,8 తరగతులకు 9-30 నుంచి10-45గంటలలో ముగించాలి. 11నుంచి 12-15వరకు 9,10 తరగతులు, 1-15 నుంచి 2-30వరకు 6,7,8తరగతులకు, 2-45నుంచి 4గంటల వరకు 9,10 తరగతులకు పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. నిబంధనల మేరకు అన్ని సమాచారాలు పిల్లలు రాయలేకపోవడంతో టీచర్లు నానా తంటాలు పడ్డారు. కొందరు టీచర్లు అయితే చదువుకునే రోజుల్లోనూ నాకే పరీక్ష, చదువు చెప్పేటప్పుడూ నాకే పరీక్ష అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హర్‌ఘర్ తిరంగా ..

శుభపరిణామం

బైకు ర్యాలీలో ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ



బైక్‌ర్యాలీలో పాల్గొన్న ఇన్‌చార్జి కలెక్టర్

అనంతపురం క్లాక్‌టవర్/కలెక్టరేట్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రతిపౌరుడు దేశభక్తిని చాటేలా హర్ ఘర్ తిరంగా నిర్వహించడం శుభ పరిణామమని ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ పేర్కొన్నారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఆగస్టు 15 సందర్భంగా సోమవారం హర్‌ఘర్ తిరంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆర్‌అండ్‌బీ అతిథిగృహం నుంచి అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, అనంత నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ రాజశేఖర్‌లతో కలిసి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ బైకు ర్యాలీ ప్రారంభించారు. ఈ ర్యాలీ జడ్పీ, సప్తగిరిసర్కిల్, సుభాష్‌రోడ్డు మీదుగా క్లాక్‌టవర్ వరకు సాగింది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ 79వ భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు రెండో తేదీ నుంచి 15 వరకు దేశవ్యాప్తంగా హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో జరుగుతున్నాయ న్నారు. ఇందులో భాగంగానే విద్యాసంస్థల్లో విద్యార్థులకు దేశభక్తి గేయాలు, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్లాక్‌టవర్ వద్ద ఏర్పాటు చేసిన హర్‌ఘర్ తిరంగా సెల్ఫీ పాయింట్‌లో ఇన్‌చార్జ్ కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్ ఫొటోలు దిగారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి జయకుమార్, అనంత నగరపాలక సంస్థ ఈఈలు షాకీర్, చంద్రశేఖర్, బీఎల్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నిర్వహిద్దాం: స్వాతంత్ర్య దినోత్సవాలు ఘనంగా నిర్వహిద్దామని ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో సోమవారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మల్లికార్జునుడు, రామ్మోహన్‌తో కలిసి స్వాతంత్ర్య వేడుకల ఏర్పాట్లపై సంబంధించి శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 14వతేదీ సాయంత్రానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. పొరబాట్లకు తావివ్వొద్దన్నారు. సమావేశంలో ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మురడి అంజన్నకు బంగారు పాదుకలు



పాదుకలు సమర్పిస్తున్న భక్తులు

డీ.హీరేహాళ్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని మురడి ఆంజనేయస్వామికి గుంతకల్లుకు చెందిన జూటూరు కుటుంబ సభ్యులు స్వర్ణ పాదుకలను సోమవారం సమర్పించారు. జూటూరు నాగరాజు, కృష్ణవేణి దంపతులు కుటుంబసమేతంగా ఆలయానికి చేరుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా తయారు చేయించిన పాదుకలను దేవదాయశాఖ అధికారి నరసింహారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులకు అందజేశారు. వీటిని 2.5 కిలోల రాగి, 100 గ్రాముల బంగారంతో తయారు చేయించినట్లు వారు తెలిపారు. వీటి విలువ రూ.11 లక్షలదాకా ఉంటుందని తెలిపారు.

పారా అథ్లెటిక్స్‌లో పతకాల పంట

- అదరగొట్టిన జిల్లా అథ్లెట్లు
- రాష్ట్రస్థాయి పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా అవతరణ

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు పతకాల పంట పండింది. మూడు రోజులపాటు విశాఖపట్నంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పారా జూనియర్, సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు ఆదివారం ముగిశాయి. జిల్లా అథ్లెట్లు ఏకంగా 23 బంగారు, 25 రజత, 18 కాంస్య పతకాలు సాధించినట్లు పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు తెలిపారు. జిల్లా జట్టు ఓవరాల్ చాంపియన్‌గా అవతరించిందన్నారు. పతకాలు సాధించిన వారికి అభినందనలు తెలిపారు. విజేతలు ఈనెల 29 నుంచి 31వతేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో నిర్వహించే జాతీయ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.



పతకాలు సాధించిన జిల్లా దివ్యాంగ క్రీడాకారులు

అందాలలో.. అహో



తాజా తాజా చేప..



పొలుసు తీసి.. పులుసు పెడదాం..!



బండరాతికి చిల్లు పడింది..



రెక్కలు లేకున్నా.. ఇక్కడి చేప గాలిలో తేలిపోతుంది



అందాల నడుమ ఆపద పొంచే ఉంటుంది.. జాగ్రత్త..!

పెన్నహోబిలం శోభాయమానంగా మారింది. క్షేత్ర సమీపంలో పచ్చని చెట్ల నడుమ, బండరాళ్లపై నుంచి జలజల దూకుతూ.. గలగల పారుతున్న తుంగభద్ర జలాలు కనువిందు చేస్తున్నాయి. స్వామి దర్శనానికి వచ్చే భక్తులు ఆధ్యాత్మిక, పర్యాటక అనుభూతిని పొందుతున్నారు. తుంగభద్ర డ్యాం నీరు హెచ్చెల్సీ ద్వారా మిడ్ పెన్నార్ డ్యాం వైపు పరుగులు తీస్తోంది. ఏటా ఈ సమయంలో పెన్నహోబిలంలో సందడి మొదలౌతుంది. వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివస్తున్నారు. పారే నీటిలో ఎగిరే చేపలను పట్టుకునేందుకు కొందరు వలలు చెట్లకు కట్టి వేట సాగిస్తున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి




నీటిలోని చేపలంట.. ఎగిరెగిరి దొరికెనంట..

ఎన్నికల కమిషన్ బీజేపీ తొత్తు

సుప్రీంకోర్టు, రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలి

సీడబ్ల్యూసీ సభ్యుడు ఎన్ రఘువీరారెడ్డి



మడకశిర, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): భారత ఎన్నికల కమిషన్ ఎన్ని అవకతవకలు చేయాలో అన్నీ చేసిందని సీడబ్ల్యూసీ సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డి ఆరోపించారు. ఎక్స్ వేదికగా ఆయన ఈసీపై విరుచుకుపడ్డారు. సీసీ ఫుటేజీ, ఓటరు జాబితా వంటి కీలక సమాచారాన్ని దాయడం, పారదర్శకత పాటించక పోవడం ప్రజాస్వామ్యానికి ముప్పు అని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషన్ నియామక ప్రక్రియ నుంచి సుప్రీం కోర్టు జడ్జిని తప్పించడం, అధికారంలో ఉన్నవారికి అనుకూలంగా ఎన్నికల తేదీలను మార్చడం, కొన్ని రాష్ట్రాలో 7, 8 విడతల్లో పోలింగ్ నిర్వహించడం, హరియాణాలో సీసీ ఫుటేజీ అడిగితే ఇవ్వలేదని, మహారాష్ట్రలో నాలుగు నెలల వ్యవధిలో పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు జరిగితే.. ఆ స్వల్ప కాలంలో 50 లక్షల ఓట్లు చేర్చడం తదితర అంశాలను ఆయన ప్రస్తావించారు. ఓట్ల చౌర్యానికి సంబంధించిన అన్ని ఆధారాలను రాహుల్ గాంధీ ఆదివారం బెంగళూరులో బయట పెట్టారని పేర్కొన్నారు. ఇప్పుడు బిహార్‌లో 65 లక్షల ఓట్లను తీసివేస్తున్నారని, తొలగించిన ఓటర్ల జాబితా అడిగితే ఇవ్వడం కుదరదని అంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటర్ ఐడీ, రేషన్ కార్డు, ఆధార్‌ను పరిగణలోకి తీసుకోవాలని సుప్రీంకోర్టు చెప్పినా ఎన్నికల కమిషన్ పట్టించుకోవడం లేదని విమర్శించారు. డిజిటల్ ఓటర్ల జాబితా, సీసీ ఫుటేజీ ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ అడుగుతోందని, ఇవ్వడానికి అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ ఆధారాలతో మాట్లాడుతుంటే ఆయనకు నోటీసులు ఇచ్చి ఎన్నికల కమిషన్ తన బాధ్యతల నుంచి తప్పించుకోవాలని అనుకుంటోందని అన్నారు. ఎన్నికల కమిషన్ బీజేపీ తొత్తుగా మారిందని ఆరోపించారు. అక్రమాలకు బాధ్యత వహించి, కేంద్ర ప్రభుత్వం అధికారం నుంచి వైదొలగాలని డిమాండ్ చేశారు. దేశ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాష్ట్రపతి కలుగ జేసుకోవాలని కోరారు. సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకుని టైమ్‌బౌండ్ ఎంక్వయిరీ చేయించాలని కోరారు. ఎన్నికల కమిషన్‌ను ప్రక్షాళన చేయాలని కోరారు. బరిష్ విధానంలో ఈ-ఓటర్ ఐడీ కార్డును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

ఎవరికెన్ని మార్కులో..!

టీచర్ డీఎస్సీ తుది మార్కులు విడుదల

807పోస్టులు...45,186 మంది పోటీ

నియామకాలకు యంత్రాంగం అడుగులు



అనంతపురం విద్య, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పోస్టులకు సంబంధించిన డీఎస్సీ తుది మార్కులను సోమవారం రాత్రి ప్రభుత్వం విడుదల చేసింది. అనంతపురం ఉమ్మడి జిల్లాకు అన్నికేడర్లకు సంబంధించి 807 టీచర్ పోస్టులు మంజూరు చేశారు. ఇందులో జడ్పీ మేనేజ్‌మెంట్‌లో అన్ని కేడర్లకు కలిపి 564పోస్టులు, గవర్నమెంట్ మేనేజ్‌మెంట్ కింద 97 పోస్టులు, మున్సిపల్ కార్పొరేషన్ 62, మున్సిపల్ మేనేజ్‌మెంట్ కింద 84పోస్టులు, కేటాయించారు. ఈపోస్టులకు ఉమ్మడి జిల్లాలో 45,186మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ఈ ఏడాది జూన్ నుంచి జూలై వరకు పరీక్షలు నిర్వహించారు. వీటి ఫలితాలను సోమవారం రాత్రి ప్రభుత్వం ప్రకటించింది. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో మార్కులు చూసుకునేలా లింక్ పెట్టారు. దీంతో ఏఅభ్యర్థికి టాప్ ర్యాంకు వచ్చిందో తెలుసుకోవడానికి కొంత ఇబ్బంది ఏర్పడింది. ప్రభుత్వం జిల్లాల వారిగా మెరిట్ లిస్టులు విడుదల చేస్తే అపుడు ఏ సబ్జెక్టులో ఏ అభ్యర్థికి టాప్ మార్కులు వచ్చాయో తెలుస్తుందని డీఈఓ ప్రసాద్ బాబు అన్నారు. కాగా ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు జిల్లా విద్యాశాఖకు ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో సర్టిఫికెట్ల పరిశీలనకు ప్రత్యేక కమిటీల ఏర్పాటుకు జిల్లా విద్యాశాఖ యంత్రాంగం కసరత్తు మొదలు పెట్టింది. మొత్తం మీద పరీక్షలు ముగిసిన నెలల వ్యవధిలోనే తుది మార్కులు ఇవ్వడంపై డీఎస్సీ అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పాలిటెక్నిక్ అడ్మిషన్లపై రూల్స్ విడుదల

అమరావతి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సుల ప్రవేశాలపై సాంకేతిక విద్యాశాఖ కొత్త రూల్స్ విడుదల చేసింది. 'ఏపీ పాలిటెక్నిక్ అడ్మిషన్ల నియంత్రణ, రాష్ట్ర స్థాయి సాంకేతిక విద్యా సంస్థల నిబంధనలు-2025' పేరుతో ఈ రూల్స్ రూపొందించింది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కార్యదర్శి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటివరకూ 1988లో ఇచ్చిన 146 జీవో ఆధారంగానే ప్రతి సంవత్సరం పాలిటెక్నిక్‌లలో అడ్మిషన్లు చేపడుతున్నారు. గత కొన్నేళ్లుగా వచ్చిన మార్పులకు అనుగుణంగా ప్రతి ఏడాదీ సవరణలు ఇస్తున్నారు. ఇకపై ప్రతిసారీ సవరణల అవసరం లేకుండా కొత్త రూల్స్ జారీచేశారు. పాలిసెట్ నిర్వహణ, పాలిటెక్నిక్‌లలో అడ్మిషన్లకు ప్రస్తుతం ఉన్న నిబంధనలే యథావిధిగా అమలవుతాయి. పాలిసెట్, అడ్మిషన్లకు ఆన్‌లైన్ విధానం కొనసాగుతుంది. ఇందుకోసం వేర్వేరుగా కమిటీలు నియమించారు. 2026-27 విద్యా సంవత్సరం నుంచి ఈ రూల్స్ అమల్లోకి వస్తాయి.

పొట్టలో పురుగుల పనిపడదాం

నేడు జాతీయ నులిపురుగుల నివారణ దినం

పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేసేలా ప్రత్యేక చర్యలు



ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

కదిరిఅర్బన్, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): నులిపురుగు.. పిల్లల పాలిట శాపం. వ్యక్తిగత పరిశుభ్రత లోపించిన పిల్లల కడుపులో నులిపురుగు పెరుగుతూ.. బరువు తగ్గేందుకు కారణమవుతుంది. రక్తహీనత, పోషకలోపం, ఆకలి లేకపోవడం, కడుపునొప్పి, బలహీనంగా తయారవడం దీని లక్షణాలు. ఏలికపాము, నులి, కొంకి ఇలా మూడు రకాల పురుగులు కలిగి ఉన్న పిల్లలు క్రమేణా బరువు తగ్గిపోతూ అనారోగ్య కారణాలతో ఇబ్బందులు పడతారు. పిల్లల ఎదుగుదల, సంపూర్ణ ఆరోగ్యంపై దృష్టి సారించిన ప్రభుత్వం ఏటా రెండుసార్లు ఫిబ్రవరి 10, ఆగస్టు 12న నులి పురుగుల నివారణ మాత్రలు వేస్తోంది.

నులిపురుగుల వ్యాప్తి

ఈగలు, దుమ్ము, ధూళి పడి కలుషితంగా మారిన తినుబండారాలను తీసుకోవడం ద్వారా పిల్లల కడుపులో నులిపురుగు వ్యాప్తి చెందుతుంది. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, వంట సరుకులను శుభ్రమైన నీటితో కడగకపోవడం, తినే ముందు, తిన్న తర్వాత చేతులు శుభ్రం చేసుకోకపోవడంతో అనేక అనర్థాలు ఉంటాయి. నులి పురుగులు చిన్నారుల పొట్టలో స్థావరం ఏర్పరచుకుని వారి ఎదుగుదలపై ప్రభావం చూపుతాయి. జిల్లాలో 1 నుంచి 19 ఏళ్ల వయసున్న వారు 3,66,225 మంది ఉండగా... వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నారు.

ఎదుగుదలకు అడ్డంకి

చిన్నపిల్లల శరీరంలో తెలియకుండానే నులి పురుగులు ఉండడంతో శారీరక ఎదుగుదల మందగిస్తుంది. మానసిక ఎదుగుదల లేకపోవడం వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. పేగుల్లో నులి పురుగులు ఉండడంతో తీసుకున్న ఆహారాన్ని అంతా అవే గ్రహించడంతో శరీరానికి పోషకాలు అందక ఎదుగుదల లోపిస్తుంది. ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. పిల్లల్లో ఏకాగ్రత కూడా నశిస్తుంది. రెండేళ్ల పైబడిన పిల్లలు ఈ వ్యాధి బారిన పడే అవకాశాలున్నాయి. నులి పురుగులు శరీరంలో ఉన్నట్లు గుర్తించడానికి సమయం పడుతుంది. పిల్లలు వయసుకు తగ్గ ఎదుగుదల, బరువు, మానసిక పరిపక్వత లేకపోవడం వంటి సమస్యలుంటే వైద్యుడిని సంప్రదించి చికిత్స చేయించాలి. సకాలంలో గుర్తించి మందులు వాడితే నులిపురుగుల బారి నుంచి పిల్లలను కాపాడుకోవచ్చు.

నివారణ చర్యలు

భోజనానికి ముందు చేతులు శుభ్రం చేసుకోవాలి. సురక్షిత, కాచి వడబోసిన నీటినే తాగాలి. ఏదైనా తిన్న తరువాత, మరుగుదొడ్డి వాడిన తరువాత చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. తీపి పదార్థాలను పిల్లలకు దూరంగా ఉంచాలి. మలబద్దకం రాకుండా చూసుకోవాలి. పీచుపదార్థాలతో కూడిన ఆహారం ఎక్కువగా ఇవ్వాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయకూడదు.

మాత్రల డోస్ ఇలా..

నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. ఏడాది నుంచి రెండేళ్లలోపు చిన్నారులకు సగం మాత్ర (200 ఎంజీ) నీటిలో కలిపి తాపాలి. 2 నుంచి 3 ఏళ్లలోపు పిల్లలకు పూర్తి మాత్ర పొడిచేసి నీటిలో కలిపి తాపాలి. 3 నుంచి 19 ఏళ్ల వారికి 400 ఎంజీ మాత్రను మధ్యాహ్నం భోజనం తరువాత చప్పరించేలా చూడాలి. ప్రతి ఆర్నెల్లకోసారి మాత్ర వేసుకోవాలి. అనారోగ్యంగా ఉన్న వారికి, ఇతర మందులు వాడుతున్న పిల్లలకు మాత్ర వేయకూడదు.



విధిగా మాత్రలు మింగించాలి

1 నుంచి 19 సంవత్సరాల వయసులోపు వారందరికీ విధిగా ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలి. ఇందుకు తల్లిదండ్రులు చొరవ చూపాలి. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, టీచర్లు, అధ్యాపకుల ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది సమన్వయంతో మధ్యాహ్న భోజనం తిన్న తర్వాత మాత్ర వేసేలా చర్యలు తీసుకున్నాం. అపోహలు లేకుండా మాత్రలు మింగించి, నులిపురుగుల నిర్మూలనలో భాగం కావాలి.

- ఫైరోజ్ బేగం, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి

నాకు నమ్మకం లేదు దొరా..!

- నా భార్య చనిపోతేనే పట్టించుకోలేదు
- సాక్ష్యాలను ఇస్తే మాయం చేశారు
- నాపైనే కేసు పెడతామని బెదిరించారు
- పోలీసు బాధితుడు.. ప్రవీణ్ ఆవేదన
- బుక్కరాయసముద్రంలో దగ్ధమైన బేకరీ



కాలిపోతున్న బేకరీ

బుక్కరాయసముద్రం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నార్పల క్రాస్ వద్ద అయ్యంగార్ బెంగళూరు బేకరీ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఉత్తర కర్ణాటకకు చెందిన ప్రవీణ్ అనే వ్యక్తి ఏడాది క్రితం బుక్కరాయసముద్రంలో ఈ బేకరీని ఏర్పాటు చేసుకున్నాడు. ఆదివారం వేకువజామున ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు చెలరేగడంతో బేకరీలో షార్ట్ సర్క్యూట్ జరిగింది. గమనించిన స్థానికులు.. పోలీసులు, అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. ఫైరింజన్ వచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేసింది. బేకరీలోని రెండు గ్యాస్ సిలిండర్లు ఒకదాని తరువాత ఒకటి పేలాయి. దీంతో మంటలను ఆర్పడం కష్టంగా మారింది. అనంతపురం-తాడిపత్రి ప్రధాన రహదారి పక్కనే ఉండడంతో అటు వైపు వెళ్లే వాహనాలను పోలీసులు ఆపేశారు. ట్రాఫిక్‌ను మళ్లించారు. చుట్టుపక్కల ఉన్న వారిని అప్రమత్తం చేశారు. గ్యాస్ సిలిండర్లు పేలిన అనంతరం మంటలను అగ్నిమాపక సిబ్బంది ఆర్పి వేశారు. అప్పటికే దుకాణంలో ఉన్న యంత్రాలు, ఫ్రిజ్‌లు, ఫర్నిచర్, నగదు, మెటీరియల్ తదితర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. రూ.25 లక్షల ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు ప్రవీణ్ తెలిపాడు. జరిగిన ప్రమాదంపై పోలీసులకు ఫిర్యాదు చేయబోనని బాధితుడు అన్నారు. తనకు వారు న్యాయం చేస్తారన్న నమ్మకం లేదని కుండ బద్దలు కొన్నారు. ఓ వ్యక్తి వేధింపుల కారణంగా తన భార్య ఆత్మహత్య చేసుకుందని, ఈ విషయంలో పోలీసులు తమకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.



సితార (ఫైల్)



సూసైడ్ నోట్

అందుకే.. నమ్మకం లేదు..

ఉత్తర కర్ణాటకకు చెందిన ప్రవీణ్, సితార దంపతులు అనంతపురానికి వలస వచ్చారు. కక్కలపల్లి సమీపంలోని టమోటా మార్కెట్ వద్ద బేకరీ ఏర్పాటు చేసుకున్నారు. అక్కడే ఉన్న ఓ టమోటా వ్యాపారి తరచూ బేకరీ వద్దకు వస్తుండేవాడు. అలా సితారతో పరిచయడం పెంచుకున్నాడు. కొన్నిసార్లు స్నేహపూర్వకంగా ఫోన్‌లో మాట్లాడాడు. వాట్సాప్ చాటింగ్ కూడా చేశాడు. ఇదే అదునుగా సితారను లైంగికంగా వేధించడం మొదలెట్టాడు. వాటిని భరించలేక సితార ఈ ఏడాది మార్చి 14వ తేదీ రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. టమోటా వ్యాపారి వేధింపులు భరించలేకే తన భార్య ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు ప్రవీణ్ ఫిర్యాదు చేశారు. అయినా పోలీసులు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. 'అన్ని అధారాలు అప్పట్లో ఇచ్చినా. ఇప్పుడు ఏమీ లేవని అంటున్నారు. టమోటా వ్యాపారి వేధింపులు భరించలేకే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సితార సూసైడ్ నోట్‌లో రాసింది. అతని పేరు కూడా రాసింది.' అని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు అతన్ని స్టేషన్‌కు పిలిపించి తూతూమంత్రంగా విచారించి వదిలేశారని సమాచారం. వివాహేతర సంబంధం నేపథ్యంలో సితారను భర్త ప్రవీణ్, కుటుంబ సభ్యులు మందలించడంతోనే మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు కేసు నమోదు చేశారు.

సెటిల్‌మెంట్ కోసం బెదిరింపులు

భార్య చనిపోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న తనను గతంలో పనిచేసిన పోలీసు అధికారి 'సెటిల్ చేసుకో.. లేకపోతే నువ్వేకొట్టావని కేసు నమోదు చేస్తా' అని బెదిరించాడని ప్రవీణ్ కన్నీటి పర్యంతమయ్యారు. సూసైడ్ లెటర్‌ను పరీక్షలకు పంపాల్సిన బాధ్యత మరచిన పోలీసులు, 'నీ భార్యే రాసిందని ఏమి ప్రూఫ్' అని ఎదురు ప్రశ్న వేశారట. ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపాలని అడిగినా పోలీసులు పట్టించుకోలేదని వాపోయాడు.

విచారణ చేయిస్తాం..

సితార ఆత్మహత్య విచారణ విషయం మా దృష్టికి రాలేదు. వేధింపులకు పాల్పడినట్లు రుజువైతే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటాం. ఇలా జరిగిందని ఏ రోజూ బాధితులు ఫిర్యాదు చేయలేదు.

- వెంకటేశులు, డీఎస్పీ

రుజువు కాలేదు..

సితార మృతి కేసులో టమోటా వ్యాపారిని పిలిపించి విచారించాం. పరిచయం మాత్రమే ఉన్నట్లు తెలిసింది. సెల్ సంభాషణ, బేకరీ వద్ద మాట్లాడినట్లు సాక్ష్యాలు ఉన్నాయి. వేధించినట్లు రుజువు కాలేదు. సూసైడ్ నోట్‌కు సంబంధించి ఆధారాలు తీసుకొస్తే ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపుతాం. ఆమె రాసినదేనని తేలితే టమోటా వ్యాపారిపై చర్యలు తప్పవు.

-పుల్లన్న, సీఐ



సీజ్‌చేసిన రేషన్ బియ్యాన్ని లారీలో లోడింగ్ చేస్తున్న సిబ్బంది

లెక్కలేనంత..!

(5వ పేజీ తరువాయి)

తీసుకొచ్చారా అనేది సందేహాస్పదంగా మారింది. దీనిపై లోతుగా దర్యాప్తు చేపడితే తప్ప.. నిజం బయటకు రాదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఎటువంటి చర్యలు చేపడతారో?

పెద్దఎత్తున రేషన్ బియ్యం సీజ్‌చేసిన అధికారులు అందుకు బాధ్యులపై ఎటువంటి చర్యలు చేపడతారోనని స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. అన్నింటిని అక్కడి నుంచి తరలిస్తే తప్ప.. ఎటువంటి చర్యలు తీసుకునేదీ వెల్లడించలేమని అధికారులు గుసగుసలాడుతున్నట్లు తెలుస్తోంది. పౌరసరఫరాల శాఖ, పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకుంటారు అని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ఊ అంటే.. వాన..!



యల్లనూరు మండలంలో భారీ వర్షానికి పొలాల్లో నిలిచిన వర్షపునీరు

(5వ పేజీ తరువాయి)

మండలంలో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయని తహసీల్దారు రాము తెలిపారు. వాగుల నుంచి వచ్చే నీరు చిత్రావతి నదిలో కలవడంతో ప్రవాహ వేగం పెరిగింది. యల్లనూరు, గడ్డంవారిపల్లి చెరువులు నిండుకుండలా మారాయి. తాడిమర్రి మండలంలోని పలు గ్రామాలలో భారీ వర్షం కురిసింది. వంకలు పొంగి పొర్లుతున్నాయి. మద్దెలచెరువు వంక పారడంతో తూర్పుచెరువుకు నీరు చేరింది. ఐదు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో పండ్ల తోటల రైతులు ఊపిరిపీల్చుకున్నారు. మరో 15 రోజులపాటు చీనీ చెట్లకు నీటిని ట్యాంకర్ల ద్వారా తోలాల్సిన అవసరం ఉండదని కునుకుంట్ల గ్రామ రైతులు హర్షం వ్యక్తం చేశారు.



నిండిన తాడిమర్రి తూర్పు చెరువు

కూలిన మిద్దెలు

భారీ వర్షాలకు పరిగి మండల కేంద్రంలో భైరెడ్డికి చెందిన పాతమిద్దె కూలిపోయింది. గదిలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఆర్ఐ సిద్దేశ్, వీఆర్ఓ సుధాకర్‌స్వామి పరిశీలించారు. పాత మిద్దెలున్నవారు ముందుగానే తమకు సమాచారం ఇవ్వాలని, కూలిన 24గంటల్లోనే తమకు తెలపాలని సూచించారు. బెళుగుప్ప మండల కేంద్రం, ఎర్రగుడి గ్రామంలో రెండు ఇళ్లు నేలకూలాయి. యలగలవంక గ్రామానికి చెందిన వేదమూర్తి ఇల్లు ఆదివారం రాత్రి కూలిపోయింది. నార్పల వడ్డే కాలనీలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి రామకృష్ణ అనే వ్యక్తికి చెందిన ఇల్లు కూలిపోయింది. రామకృష్ణ కుటుంబ సమేతంగా ఇంట్లో నిద్రిస్తుండగా ఒక మూలన గోడ పడిపోంది. వెంటనే అందరూ బయటకు వెళ్లిపోయారు. ఆ తరువాత అరగంటలోనే ఇల్లు మొత్తం కూలిపోయింది. ఇంట్లో ఉన్న వంట సామగ్రి, తిండిగింజెలు పాడైపోయాయి. రెవెన్యూ అధికారి రామకృష్ణ ఇంటిని పరిశీలించారు. ధర్మవరం మండలంలోని పోతుకుంట, రావులచెరువు గ్రామాల్లో వర్షానికి సోమవారం రెండు ఇళ్లు కూలిపోయాయని తహసీల్దార్ సురేష్‌బాబు తెలిపారు. అత్యవసర సాయం కోరం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, సెల్ నంబర్ 9553929724కు సమాచారం అందించాలని కోరారు.



నార్పల వడ్డే కాలనీలో కూలిన ఇల్లు

క్రైం కార్నర్

చిన్నారిపై హత్యాచారం కేసులో యావజ్జీవం

● తీర్పునిచ్చిన స్పెషల్ కోర్టు న్యాయాధికారి


నిందితుడు గంగాధర్ (ఫైల్)

హిందూపురం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): చిన్నారిపై అత్యాచారం, హత్య కేసులో నిందితుడు గంగాధర్‌కు యావజ్జీవ కారాగార శిక్ష పడింది. కేసు వివరాలు ఇలా... కర్ణాటక రాష్ట్రం నామగుండ్ల గ్రామానికి చెందిన మహిళ తన ఇద్దరు కుమార్తెలను తీసుకుని హిందూపురం మండలం తూమకుంట గ్రామంలో ఉన్న తన సొంత అక్క ఇంటికి వచ్చారు. అయితే అక్క భర్త(బావ) గంగాధర్ ఆడుకుంటున్న ఎనిమిదేళ్ల చిన్నారిని గత ఏడాది ఆగస్టు 2న సమీప పొలాల్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేసి, ఆపై హత్యచేసి పెన్నానది ఒడ్డున పూడ్చేశాడు. ఎంతసేపటికీ చిన్నారి కనిపించకపోవడంతో తల్లి ఆందోళనతో వేదికింది. దీంతో చుట్టు పక్కల ఉన్న వారు చిన్నారిని గంగాధర్ తీసుకెళ్లినట్లు చెప్పారు. దీంతో ఆమె గట్టిగా నిలదీశారు. చుట్టుపక్కలవారు సైతం గంగాధర్‌ను పట్టుకుని దేహశుద్ధి చేశారు. దీంతో చంపేసి పూడ్చినట్లు ఒప్పుకున్నాడు. సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నేరం ఒప్పుకోవడంతో కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసులో 17మంది సాక్షులను విచారించగా నేరం రుజువైంది. దీంతో అనంతపురం పోక్సో కేసుల స్పెషల్ కోర్టు న్యాయాధికారి చిన్నబాబు సోమవారం గంగాధర్‌కు యావజ్జీవ కారాగారశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. అలాగే సాక్ష్యాన్ని తారుమారు చేసేందుకు చిన్నారి శవాన్ని పూడ్చడంపై ఐదేళ్ల జైలుశిక్ష, మరో రూ.10వేలు జరిమానా విధించారు. ఈ కేసు పకడ్బందీగా దర్యాప్తు చేపట్టి, నిందితుడికి శిక్షపడేలా చేసిన డీఎస్పీలు కంజక్షన్, మహేష్, సీఐలు ఆంజనేయులు, శ్రీనివాసులును జిల్లా ఎస్పీ అభినందించారు.

డ్రైనేజీలో పడి చేనేత కార్మికుడి మృతి

ధర్మవరం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీదేవి థియేటర్ వద్ద డ్రైనేజీ కాలువలో పడి చేనేత కార్మికుడు సుపారి నాగరాజు (60) సోమవారం మృతిచెందాడు. వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని బసవన్నకట్ట వీధికి చెందిన సుపారి నాగరాజు పట్టుచీరలు మడతలు వేస్తూ జీవించేవాడు. తరచూ మద్యం తాగేవాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి మద్యం తాగి, శ్రీదేవి థియేటర్ సమీపంలోని గ్రంథాలయం ఎదురుగా డ్రైనేజీ పక్కన పడిపోయాడు. రాత్రి వర్షం రావడంతో ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన నీటి ప్రవాహానికి డ్రైనేజీలోకి పడిపోయి, చనిపోయాడు. సోమవారం ఉదయం పారిశుధ్య కార్మికులు.. డ్రైనేజీని శుభ్రం చేస్తుండగా నాగరాజు మృతదేహం బయటపడింది. స్థానికులు గుర్తించి, అతడి కుమారుడు మనోహర్‌కు సమాచారం అందించారు. మనోహర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. నాగరాజు భార్య గతంలోనే మరణించింది.

పిచ్చికుక్క స్వైరవిహారం.. ఐదుగురిపై దాడి

ఉరవకొండ, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పిచ్చికుక్క సోమవారం స్వైరవిహారం చేసింది. పాత స్టేట్ బ్యాంకు, జైనబ్బీ దర్గా, కవిత హోటల్, టవర్ క్లాక్ కూడలిలో పలువురిపై దాడిచేసింది. వివిధ పనుల నిమిత్తం ఉరవకొండకు వచ్చిన చిన్నముష్టూరు, పొట్టిపాడు, చిన్నహోతూరు గ్రామాలకు చెందిన వారిని గాయపరిచింది. పిచ్చికుక్క దాడిలో రాము, ఓబులేశు, నారాయణ, రామాంజనేయులు మరో వ్యక్తి గాయపడ్డారు. వారిని ప్రథమ చికిత్స కోసం ఉరవకొండ ఆస్పత్రికి తరలించారు.

రూ.36 లక్షల ఎయిర్ ఫైబర్ రూటర్ చోరీ


ఎయిర్‌ఫైబర్ రూటర్ గది

గాండ్లపెంట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో రూ.36లక్షల విలువ చేసే ఎయిర్ ఫైబర్ రూటర్ సామగ్రి శనివారం చోరీ అయినట్లు సిబ్బంది సోమవారం తెలిపారు. సబ్‌స్టేషన్ ఎయిర్‌ఫైబర్ సిబ్బంది రాజు తెలిపిన మేరకు.. సబ్‌స్టేషన్‌లో రూ.36లక్షల విలువ చేసే రూటర్ సామగ్రిని అమర్చారన్నారు. శనివారం గుర్తుతెలియని వ్యక్తులు ఎయిర్‌ఫైబర్ సిబ్బంది అంటూ గదిలోకి ప్రవేశించి, అందులోని రూటర్‌ను తీసుకెళ్లారన్నారు. అక్కడున్న సిబ్బంది ప్రశ్నించగా, తాము ఎయిర్‌ఫైబర్ సిబ్బంది అంటూ సమాధానమిచ్చినట్లు తెలిపారు. రూటర్‌ను కారులో తీసుకెళ్లినట్లు వివరించారు. తాము ఆదివారం గమనించడంతో చోరీ విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. ఈవిషయంపై ట్రైనీ ఎస్ఐ రవికుమార్‌ను వివరణ కోరగా, తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదన్నారు. ఎయిర్ ఫైబర్ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మహిళ పట్ల అసభ్య ప్రవర్తన

● వ్యక్తిపై కేసు నమోదు

ధర్మవరం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రెడ్డెప్ప తెలిపారు. సీఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రస్తుతం పట్టణంలో ఉంటున్న మహిళ, ఆమె భర్త ఏడాది క్రితం బత్తలపల్లిలో ఉండేవారు. అక్కడ అక్కడ కిరాణా షాపు నిర్వహిస్తుండేవారు. ఆ సమయంలో బత్తలపల్లికే చెందిన బోయ గోపాల్ అప్పుడప్పుడు దుకాణానికి వస్తుండేవాడు. ఆ పరిచయంతో సదరు మహిళ ఫోన్ నంబరు తీసుకుని, చనువుగా మాట్లాడేవాడు. ఆ తరువాత ఆమె మాట్లాడిన మాటలను రికార్డు చేశాడు. వాటిని వినిపిస్తూ తనకు డబ్బు ఇవ్వాలనీ, లేకపోతే కోరిక తీర్చాలని ఆమెను గోపాల్ వేధించేవాడు. 'లేదంటే నీ భర్తకు చూపిస్తాన'ంటూ బెదిరించేవాడు. విషయాన్ని సదరు మహిళ.. భర్తకు చెప్పింది. దీంతో బత్తలపల్లి నుంచి ధర్మవరానికి వచ్చేశారు. అయినా గోపాల్... వేధింపులు ఆగలేదు. ఈనెల 7వ తేదీన రాత్రి చందన ఇంట్లో ఒంటరిగా ఉన్న విషయం తెలుసుకున్న గోపాల్ అర్ధరాత్రి దాటాక తలుపులు గట్టిగా కొట్టసాగాడు. ఎవరో అని సదరు మహిళ తలుపులు తీసింది. గోపాల్ తనతో వస్తావా.. లేదా.. అంటూ నానా దూర్భాషలాడుతుండటంతో ఆమె గట్టిగా కేకలు వేసింది. చుట్టుపక్కల వారు రావడంతో గోపాల్ పరారయ్యాడు. ఈ మేరకు బాధిత మహిళ సోమవారం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రెడ్డెప్ప తెలిపారు.

బడిలో భయం..!

● శిథిలావస్థలో తరగతి గదులు
● పరిగిలో ఓ ప్రైవేట్ పాఠశాలలో భద్రత గాలికి..
● కూలే స్థితిలో గోడలు.. స్కూల్ చుట్టూ ఇటుక బట్టీలు
● ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు
● పెచ్చులూడిపడిన కె.రాంపురం అంగన్‌వాడీ సెంటర్ పైకప్పు

కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పాత భవనాల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలోనే చిన్నారులు రోజు వెళ్లే అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో పరిస్థితులపై ఆందోళన నెలకొంది. వాటి యాజమాన్యాలు పట్టించుకోకపోవడంతో ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోనని, టీచర్లు, విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. ఇందుకు కొన్ని ప్రైవేట్ పాఠశాలలు కూడా మినహాయింపు కాదు. ఉన్నతాధికారుల ఉదాశీన వైఖరిలో పిల్లల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.


వర్షానికి నెమ్మెక్కిన పాఠశాల వెనుక గోడలు


పాఠశాలకు ఆనుకుని ఉన్న ఇటుక బట్టీలు

పరిగి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శ్రీరంగరాజుల పల్లి రహదారిలో ఎనిమిదేళ్ల కిందట వేరే రాష్ట్రానికి చెందిన వ్యక్తి తాత్కాలికంగా భవన అనుమతులు పొంది బెల్లా పాఠశాలను ఏర్పాటు చేశాడు. ఇంగ్లిష్ మీడియం పేరుతో ఫీజులు బాగానే వసూలు చేస్తూ పిల్లల భద్రతను మాత్రం మరిచిపోయాడు. ఇటీవల కురిసిన వర్షాలకు పాఠశాల గదులకు చెమ్మ వచ్చి, కూలిపోయే పరిస్థితి ఏర్పడింది. వర్షం వస్తే కిటికీల నుంచి తరగతి గదుల్లోకి నీరు వస్తోంది. పునాదులు లేకుండా గోడలు నిర్మించడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అలాగే పాఠశాల చుట్టూ ఇటుకల బట్టీలు ఉండటంతో దాని నుంచి వచ్చే పొగ పీల్చి విద్యార్థులు శ్వాసకోశ సమస్యలు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. దాదాపు 300మందికిపైగా విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని, విద్యార్థులను ప్రమాదం నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

● ఈ విషయంపై కరస్పాండెంట్ వర్గీస్‌ను ఫోన్‌లో వివరణ కోరగా తాను పాఠశాలలో లేనని సొంతపనిపై కేరళ వచ్చానని బదులిచ్చారు. ఇటుక బట్టీల మధ్యలో గదులు ఎందుకు నిర్మించారని ప్రశ్నించగా తానిప్పుడు సమాధానం ఇవ్వలేనని ఇతర పనుల్లో ఉన్నానని కాల్ కట్ చేశారు.

చర్యలు తీసుకుంటాం: లక్ష్మీదేవి, ఎంఈఓ



పునాదులు లేకుండా తరగతి గదులను నిర్మిస్తే, దీనిపై ఉన్నతాధికారులతో చర్చించి రాబోయే కాలంలో గుర్తింపు రద్దు చేస్తాం. చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పాఠశాల గదులు ధృడంగా నిర్మించాలి. ఇంగ్లిష్ మీడియం పేరుతో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి అధిక ఫీజు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

వానొస్తే పెచ్చులూడుతున్నాయ్..!


పెచ్చులూడిన పై కప్పు నుంచి కనిపిస్తున్న ఇనుప కడ్డీలు

కళ్యాణదుర్గం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కంబదూరు మండలంలోని కే.రాంపురం అంగన్‌వాడీ సెంటర్ పూర్తిగా శిథిలావస్థకు చేరింది. చిన్న వర్షం వచ్చినా పైకప్పు పెచ్చులూడి పడుతున్నాయి. ఆ అంగన్‌వాడీ సెంటర్ భవనం పైకప్పు పెచ్చులు సోమవారం కూడా ఊడిపడటంతో సిబ్బంది, పిల్లలు తీవ్ర ఆందోళన చెందారు. పైకప్పు పెచ్చులూడిపోయి, అందులో ఉన్న ఇనుప కడ్డీలన్నీ బయటకు కనిపిస్తున్నాయి. దీంతో వర్షపు నీరంతా లీకేజీ అవుతూ, గది మొత్తం తడిసిపోయింది. 35 ఏళ్ల కిందట నిర్మించిన ఈ భవనం అంతా పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఈ అంగన్‌వాడీ కేంద్రానికి 20 మంది దాకా పిల్లలు వస్తున్నారు. భవనం పెచ్చులూడిపడుతుండటంతో వారందరినీ ఆరు బయటే కూర్చోబెడుతున్నారు. భవనం శిథిలావస్థకు చేరడంతో, అంగన్‌వాడీ సెంటర్‌కు పిల్లలను పంపించాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ భవనానికి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


ఆరుబయటే కూర్చున్న పిల్లలు

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరించండి

● కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కోరిన టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు


కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు నేతృత్వంలో హోం శాఖ మంత్రిని కలిసిన ఉమ్మడి జిల్లా టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేల ప్రతినిధుల బృందం

అనంతపురం/పుట్టపర్తి ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరణ విషయంలో జోక్యం చేసుకోవాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను ఉమ్మడి జిల్లాకు చెందిన టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు కోరారు. కేంద్ర మంత్రి అమిత్‌షాను పార్లమెంట్ భవన్‌లోని ఆయన కార్యాలయంలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు నేతృత్వంలో ఎంపీలు టీకే పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, ఎంఎస్‌రాజు, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ సోమవారం కలిశారు. ఆర్డీటీ సేవలకు సహకరించాలని కోరడంతోపాటు ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేస్తూ వినతిపత్రం అందజేశారు. అత్యంత వెనుకబడిన, దుర్భిక్ష ప్రాంతమైన ఉమ్మడి అనంతపురం జిల్లా కేంద్రంగా ఐదున్నర దశాబ్దాలుగా ఆర్డీటీ ప్రజలకు అనేక రూపాల్లో అందిస్తున్న సేవలను వారు హోం మంత్రికి వివరించారు. 2021 నుంచి ఆర్డీటీకి విదేశీ విరాళాల సేకరణలో కలుగుతున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. విదేశీ విరాళాల విషయంలో ఆంక్షల వల్ల సంస్థ కొనసాగిస్తున్న కార్యకలాపాలకు అవరోధం ఏర్పడిందని తెలిపారు. కేంద్ర హోం శాఖ సూచన మేరకు ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరణకు ఆర్డీటీ మూడు నెలల కిందట దరఖాస్తు సమర్పించిందన్నారు. ఆ దరఖాస్తును పరిశీలించి, సానుకూలమైన నిర్ణయం తీసుకోవాలని వారు అమిత్‌షాను కోరారు. అనంతపురం జిల్లాతోపాటు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని అత్యంత మారుమూల ప్రాంతాల్లో ఆర్డీటీ విశేష సేవలు అందిస్తోందని వారు హోం మంత్రికి వివరించారు. అలాంటి సంస్థ కార్యకలాపాలు మరింత విస్తృతం చేయడం ద్వారా పేదలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. టీడీపీ ప్రజాప్రతినిధులు బృందం విజ్ఞప్తికి హోం మంత్రి సానుకూలంగా స్పందించడంతోపాటు ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరణ విషయంలో వారం రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసినందుకుగాను హోంమంత్రిని, కేంద్ర ప్రభుత్వాన్ని టీడీపీ ప్రతినిధుల బృందం అభినందించింది.


కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడుతో చర్చిస్తున్న టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేల బృందం

ఉచిత ప్రయాణానికి సర్వం సిద్ధం

● ఆర్టీసీ జోనల్ చైర్మన్, ఎమ్మెల్యే


గ్యారేజీలో కార్మికులతో మాట్లాడుతున్న జోనల్ చైర్మన్, ఎమ్మెల్యే

కదిరి, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి సర్వం సిద్ధం చేసినట్లు ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ డిపో, బస్టాండ్‌ను వారు సోమవారం పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న కార్మికులు, ప్రయాణికులతో మాట్లాడారు. కదిరి బస్టాండ్ నుంచి డిపో వరకు రూ.20లక్షలతో రోడ్డు నిర్మిస్తామన్నారు. రూ.8కోట్లతో కదిరి ఆర్టీసీ బస్టాండ్‌లో 16 టెర్మినల్స్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. అధునాతమైన మరుగుదొడ్లు నిర్మిస్తామన్నారు. మరో రెండు నీటిశుద్ధి ప్లాంట్లు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రయాణికుల రద్దీకి తగ్గట్టుగా బస్సులు నడుపుతామన్నారు. వారి వెంట డీఎం ఫైనుద్దీన్, ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు.

సెక్టోరల్స్‌కు ఇంటర్వ్యూలు ప్రారంభం


సెక్టోరల్స్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం విద్య, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష శాఖ సెక్టోరల్స్ పోస్టుల భర్తీకి యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఆరు పోస్టులకు 47మంది టీచర్లు అర్హుల జాబితాలోకి వచ్చారు. వీరందరికీ ఇంటర్వ్యూలు ప్రారంభించారు. కలెక్టరేట్‌లోని ఎస్ఐసీ సెంటర్‌లో సోమవారం ఇంటర్వ్యూలు మొదలు పెట్టారు. అసిస్టెంట్ కలెక్టరు సచిన్ రహార్, డీఈఓ ప్రసాద్‌బాబు, ఎస్ఎస్ఏ ఏపీసీ శైలజ, డైట్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. తొలిరోజు 25మందిని ఇంటర్వ్యూలకు ఆహ్వానించగా, 22మంది హాజరైనట్లు ఏపీసీ శైలజ తెలిపారు. మిగిలిన 22 మంది టీచర్లకు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఏపీసీ తెలిపారు.

ఉద్యోగాల పేరుతో రూ.13 లక్షల మోసం

● పోలీసులను ఆశ్రయించిన బాధితులు

గార్లదిన్నె, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): వివిధ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి నిరుద్యోగులకు రూ.13 లక్షలు మోసం చేసిన ఉదంతం మండలంలో వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కనుంపల్లికి చెందిన సుధాకర్, రవిరాజు అన్నదమ్ములు. గ్రామంలోనే ఆర్మీ కోచింగ్ సెంటర్ నిర్వహిస్తుండేవారు. వివిధ ప్రాంతాల నుంచి యువకులు అందులో చేరారు. కోచింగ్ పూర్తి చేసుకుంటే ఆర్మీ, రైల్వే వివిధ శాఖల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికారు. వారి మాటలు నమ్మిన కొంతమంది యువకులు ఉద్యోగాలు వస్తే తమ కష్టాలు తీరుతాయని ఆశపడ్డారు. వారు అడిగినంత డబ్బును ముట్టజెప్పారు. అందులో శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం కట్టకిందపల్లికి చెందిన రామాంజనేయులు మూడేళ్ల క్రితం కనుంపల్లి ఆర్మీ కోచింగ్ సెంటర్‌లో చేరాడు. గార్లదిన్నెకు చెందిన రవితేజ కూడా చేరాడు. రామాంజనేయులకు రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పడంతో గతేడాది విడతల వారీగా రూ.10లక్షల వరకు రవిరాజు తీసుకున్నాడు. రవితేజ కూడా రూ.3 లక్షల వరకు ఇచ్చాడు. ఉద్యోగాలు ఇప్పించకపోవడంతో డబ్బు వాపసు ఇవ్వాలని వారు ఒత్తిడి చేశారు. భూమి విక్రయానికి పెట్టామనీ, అమ్మడవగానే డబ్బు ఇస్తామని అదిగో... ఇదిగో అంటూ కాలయాపన చేశారు. దీంతో బాధితులు.. చివరకు పోలీసులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహహ్మద్ గౌస్‌బాషా తెలిపారు.

మద్యానికి డబ్బు ఇవ్వలేదని ఆత్మహత్య

పరిగి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్. ముద్దిరెడ్డిపల్లికి చెందిన సీకే గంగాధరప్ప (44) సోమవారం ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. జమేదార్ శ్రీనివాసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గంగాధరప్ప రైతు. మద్యానికి బానిసయ్యాడు. వారం రోజులుగా విపరీతంగా మద్యం తాగాడు. మద్యం సేవించడానికి కుటుంబ సభ్యులు డబ్బు ఇవ్వకపోవడంతో మనస్తాపం చెంది గ్రామ సమీపంలోని పొలంలో చెట్టుకు ఉరేసుకుని, మరణించాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని హిందూపురం ఆస్పత్రికి తరలించారు. గంగాధరప్ప భార్య రాధమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు జమేదార్ తెలిపారు.

టమోటా కిలో రూ.46

అనంతపురం రూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి మార్కెట్‌లో సోమవారం కిలో టమోటాలు గరిష్ఠంగా రూ.46తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్ కుమార్ తెలిపారు. కనిష్ఠ ధర రూ. 27, సరాసరి ధర రూ. 34 పలికాయన్నారు. మార్కెట్‌కు 3,375 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం రూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 16వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు.

మాతాశిశు మరణాలు జరగకూడదు

● ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): బిడ్డకు జన్మనిస్తూ ఏ తల్లీ చనిపోకూడదని, ఏ శిశువూ జన్మించే సమయంలో మృతి చెందకూడదని ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ అన్నారు. కలెక్టరేట్‌లో డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి యుగంధర్‌తో సోమవారం సమీక్ష నిర్వహించారు. కూడేరు, నాగసముద్రం, విడపనకల్లు, అంబేడ్కర్ నగర్ పీహెచ్‌సీలలో జరిగిన తల్లి మరణాల గురించి సమీక్షించారు. జిల్లాలో తల్లి మృతి చెందినప్పుడు, మరణానికి ముందు ఏ రకమైన ఇబ్బందులు ఎదురయ్యాయి, అందుకు కారణాలు తెలుసుకోవాలని ఆదేశించారు. మరోసారి ఇలాంటి కారణంతో మరణం జరగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. మరణాలను నివారించడానికి వైద్యశాఖలో ఉన్న సూపర్‌వైజర్, సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇకపై మాతృ మరణాలు జరిగినచోట తానే స్వయంగా వచ్చి విచారిస్తానని అన్నారు. ప్రతి గర్భిణికి 12 వారాల్లోపు అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించి, వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ప్రమాదకర లక్షణాలున్న స్త్రీల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, సుఖప్రసవం జరిగేలా చూడాలని ఆదేశించారు. రక్తహీనత, గుండె సంబంధిత సమస్యలు, తక్కువ ఎత్తు, గర్భంలో ఉమ్మనీరు తక్కువ, బిడ్డ పెరుగుదల లేకపోవడం వంటి సమస్యలున్న హైరిస్క్ గర్భిణులను గుర్తించి, వారికి ప్రత్యేక వైద్యసేవలు అందించాలని సూచించారు. శిశు మరణాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.


మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత



లబ్ధిదారుడికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ



పరిటాల క్యాంపు కార్యాలయంలో చెక్కులు అందచేస్తున్న ధర్మవరపు మురళి

శింగనమల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని 12 మందికి రూ. 23,98,490ల మేర సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. అందుకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పేదలకు ఈ సీఎంఆర్ఎఫ్ వరం లాంటిదన్నారు. వైద్యం ఖర్చులను ఈ నిధులను వెచ్చించాలని సూచించారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు గుర్రం లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకులు జీసీ బాబు, పసుపుల శ్రీరామిరెడ్డి, ఆకుల ఎర్రినాగప్ప, వెంకటేష్, నరసింహారెడ్డి, సోము, చిరంజీవి, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

●రాప్తాడు: మండలంలో పలు గ్రామాలకు చెందిన నలుగురికి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. వాటికి సంబంధించిన చెక్కులను అనంతపురం నగరంలోని పరిటాల క్యాంపు కార్యాలయంలో టీడీపీ మండల ఇన్‌చార్జి ధర్మవరపు మురళి లబ్ధిదారులకు అందజేశారు. గొందిరెడ్డిపల్లికి చెందిన పునిత్ జైస్వాల్‌కు రూ. 45 వేలు, ప్రసన్నాయపల్లికి చెందిన బుడగ అఖిలకు రూ. 1.29 లక్షలు, గొల్లపల్లికి చెందిన సుధాకర్‌రెడ్డికి రూ. 43 వేలు, ఎం. చెర్లోపల్లికి చెందిన బట్ట చిన్ననారాయణకు రూ. 1.49 లక్షలు, గొందిరెడ్డి పల్లికి చెందిన వెంకట్రామిరెడ్డికి రూ. 42 వేల మేర చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సర్పంచ్ శీనయ్య, ఎంపీటీసీ సభ్యుడు జాఫర్, క్లస్టర్ ఇన్‌చార్జి రాము తదితరులు పాల్గొన్నారు.

నగరంలో మోస్తరు వర్షం



రామ్ నగర్‌లోని ఫ్లైఓవర్ వద్ద మడుగును తలపిస్తున్న సర్వీస్ రోడ్డు

అనంతపురం నగరంలో సోమవారం సాయంత్రం ఎడతెరపి లేని వర్షం కురిసింది. సుమారు గంటకు పైగా మోస్తరు వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. డ్రైనేజీ కాలువలు పొంగిపొర్లాయి. ముఖ్యంగా రామ్‌నగర్‌లోని రోడ్లపై మోకాలిలోతున నీరు ప్రహించాయి. రోడ్లపై ప్రయాణించడానికి వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

క్రీడాసామగ్రి పంపిణీ

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):మండలంలోని మేడాపురం జిల్లా పరిషత్‌ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు పూర్వ విద్యార్థి కేశవరెడ్డి క్రీడా సామగ్రిని సోమవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తాను చదువుకున్న పాఠశాలలో విద్యార్థులను ప్రోత్సహించేందుకే తనవంతుగా క్రీడాసామాగ్రిని అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం మధురవాణి, పాఠశాల కమిటీ చైర్మన్ బయన్న, మాజీ సర్పంచ్ పసలపెద్ద వెంకటరాముడు, టీడీపీ నాయకులు లడ్డులక్ష్మయ్య, వెంకటేశ్, పక్కీరప్ప, రాము, అనిల్, ఉపాధ్యాయులు,గ్రామస్థులు పాల్గొన్నారు.

తప్పిపోయిన పిల్లలు తల్లిదండ్రుల చెంతకు..



పోలీసులు వద్ద చిన్నారులు

అనంతపురం క్రైం, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): స్కూల్ నుంచి మిస్సైన ముగ్గురు విద్యార్థులను వన్ టౌన్ పోలీసులు సురక్షితంగా తల్లిదండ్రులకు చెంతకు చేర్చారు. కమలానగర్‌కు చెందిన గంగారామ్ కుమార్తె 8వ తరగతి చదువుతోంది. కుమారుడు 5వ తరగతి చదువుతున్నాడు. హీరాలాల్ అనే మరో వ్యక్తి కుమార్తె 7వ తరగతి చదువుతోంది. వీరంతా నగరంలోని రోటరీ స్కూల్‌లో చదువుతున్నారు. కాగా సోమవారం ఉదయం 8:30 గంటలకు స్కూల్‌కు వెళ్తామని బయలుదేరి వెళ్లారు. అయితే 9 గంటలకు మీ పిల్లలు స్కూల్‌కు రాలేదంటూ ఫోన్ వెళ్లడంతో పేరెంట్స్ ఉలిక్కిపడ్డారు. వెంటనే వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేయగా.. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శ్రీనివాసులు పోలీస్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. సీసీ కెమెరాల్లో పర్యవేక్షిస్తూ....పిల్లలు 1వ రోడ్డులోని శివాలయం వద్ద ఉన్నట్టు గుర్తించి వెంటనే తీసుకొచ్చారు. అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు.

గిరిజనులకు విదేశీ విద్యాపథకాన్ని పునరుద్ధరించాలని వినతి

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): 2019కి ముందు టీడీపీ ప్రభుత్వంలో గిరిజన విద్యార్థులకు అమలు చేసిన అంబేడ్కర్ విదేశీవిద్యను పునరుద్ధరించాలని ఏకలవ్య ట్రైబల్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకట రామయ్య కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసరావును కలిసిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట రామయ్య మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఏకలవ్య విగ్రహ ఏర్పాటు చేయాలని, టవర్‌క్లాక్ వద్ద నున్న ఫ్లైఓవర్‌కు ఏకలవ్యగా నామకరణం చేయాలని కోరారు. గిరిజనులకు 300యూనిట్లు ఉచిత విద్యుత్తు అందించాలని, 50 ఏళ్ల దాటిన ఎస్టీలకు పెన్షన్ ఇవ్వాలని అన్నారు. అలాగే ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ఎరుకుల కార్పోరేషన్‌కు ప్రత్యేక నిధులు కేటాయించాలని విన్నవించారు. ఏకలవ్య ట్రైబల్స్ ఫెడరేషన్ నాయకులు గుజ్జల రాము, దేవరకొండ చంద్రప్ప, రాజు, బ్రహ్మయ్య, సోమశేఖర్, వీర తదితరులు పాల్గొన్నారు.

'జిల్లా మహాసభలను విజయవంతం చేయండి'

శింగనమల ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో రెండురోజుల పాటు జరిగే సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు డీ చిన్నప్ప యాదవ్ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీపీఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా 25వ జిల్లా మహాసభలు ఈనెల 12, 13 తేదీల్లో అనంతపురంలో నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా నలుమూలలు నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మధు యాదవ్, నేసే మధు, వెంకటరాముడు, రామాంజనేయులు, బాలిరెడ్డి, పెద్దన్న, ఆదెన్న, రమణయ్య పాల్గొన్నారు.

దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



డిప్యూటి తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు

గార్లదిన్నె, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ అధికారులపై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు నాగదివాకర్, వీఆర్‌ఓల సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు ఓబులేసు డిమాండ్ చేశారు. మట్టి అక్రమ రావాణాను అడ్డుకునేందుకు వెళ్లిన కల్లూరు వీఆర్‌ఓ రవికాంత్, వీఆర్ఏ నాగరాజు పై పలువురు దాడి చేయడాన్ని నిరసిస్తూ సోమవారం వారు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. వీఆర్‌ఓ రవికాంత్, వీఆర్ఏ నాగరాజుపై దాడిచేసిన వారి పట్ల చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జునకు అందచేశారు. పలువురు వీఆర్‌ఓలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

ఏఎంసీలోని పీజీఆర్ఎస్‌కు 12 వినతులు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగరపాలక సంస్థ లో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను నిర్వహించారు. ఇందులో ఇన్‌చార్జి కమిషనర్ రాజశేఖర్, ఏసీపీ శిరీష ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు మొత్తం 12 వినతిపత్రాలు సమర్పించారు. ముఖ్యంగా నగరంలో చాలా చోట్ల పందులు, కోతులుచ కుక్కల బెడద అధికమైందని, వాటి బారి నుంచి రక్షించాలని పలువురు నగరవాసులు వినతిపత్రం అందించారు. అలాగే మురుగుకాలవలు, సీసీరోడ్లు నిర్మించాలని, ఇంకా ఇతర సమస్యలు పరిష్కరించాలని వినతులు అందించారు.

సర్పంచులకు గౌరవ వేతనం చెల్లించాలి

నార్పల, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులను జమ చేయాలని, సర్పంచుల గౌరవ వేతనాన్ని చెల్లించాలని మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మండలకేంద్రంలో సోమవారం తహసీల్దార్ అరుణకుమారిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. మండలంలో 17 గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం, సాధారణ నిధులు ఇంకా రాలేదన్నారు. గ్రామ పంచాయతీల్లో చాలా సమస్యలు నెలకొన్నాయన్నారు. వాటిని పరిష్కరించాలంటే నిధులు కావాల్సి ఉందన్నారు. కావున 15వ ఆర్థిక సంఘంతో పాటు సాధారణ నిధులు, సర్పంచుల గౌరవ వేతనాలను వెంటనే చెల్లించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సాకే రామాంజనేయులు, కుళ్లాయిరెడ్డి, కుళ్లాయప్ప, నాగన్న, రాము, నాగార్జున, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలి: సీపీఎం

అనంతపురంరూరల్,ఆగస్టు11(ఆంధ్రజ్యోతి):అర్హులైన పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అనంతపురం రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. పార్టీ నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ.. ఉప్పరపల్లి, సీతారాం ఏచూరినగర్, దామోదర సంజీవయ్య నగర్‌లలో పేదలు గత కొన్నేళ్లుగా గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. వీరికి ఇళ్ల పట్టాలు ఇచ్చి భరోసా కల్పించాలన్నారు. అనంతరం తహసీల్దార్ మోహన్‌కుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటనారాయణ, ప్రకాష్, మసూద్, వలీ, రాజు, గఫూర్ తదితరులు, ఆయా కాలనీల ప్రజలు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న నగర కార్యదర్శి రామిరెడ్డి

ఎఫ్‌సీఆర్ఏను రెన్యువల్ చేయాలి

గార్లదిన్నె, నార్పల, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏను రెన్యూవల్ చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. నార్పల, గార్లదిన్నెలో మహిళా సంఘాల సభ్యులతో కలిసి సోమవారం ర్యాలీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో పేదలకు ఆర్డీటీ అనేక సేవలు అందిస్తోందని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కదిరప్ప అన్నారు. అలాంటి ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏను రెన్యూవల్ చేయకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఆర్ఏను రెన్యూవల్ చేయాలని కోరారు. అనంతరం గార్లదిన్నె డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జునకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నరసింహులు, ఓబులపతి, పెన్నోబిలేసు, నాగన్న, చితంబరమ్మ, రోజా, హేమలత, మహిళా సంఘం సభ్యులు, దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పుల్లన్న పాల్గొన్నారు. నార్పలలో ఆర్డీటీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. జిల్లాలో పేదలకు అనేక సేవలందిస్తున్న ఆర్డీటీకి కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఆర్ఏను రెన్యువల్ చేయాలని కోరారు.

గ్రామాల్లో మీ సమస్య-మా బాధ్యత



దుబ్బార్లపల్లిలోని కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు, అధికారులు

రామగిరి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుబ్బార్లపల్లి గ్రామంలో సోమవారం టీడీపీ నాయకులు, అధికారులు కలిసి మీ సమస్య-మా బాధ్యత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో గ్రామస్థులు పలు సమస్యలకు పరిష్కారం కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. ముఖ్యంగా రేషన్‌కార్డులు, పింఛన్లు, ఇంటిస్థలాలు మంజూరు చేయాలని, భూసమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతులు అందించారు. వాటిని స్వీకరించిన నాయకులు, అధికారులు సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రామ్మూర్తినాయుడు, రంగయ్య, సుధాకర్, పరంధామయాదవ్, లక్ష్మీనారాయణరెడ్డి, మంగాపురం ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

●రాప్తాడు: యర్రగుంట, వరిమడుగు గ్రామాల్లో టీడీపీ నాయకులు మీ సమస్య- మా బాధ్యత కార్యక్రమం నిర్వహించి పలువురి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. పార్టీ మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు నారాయణస్వామి, గంగలకుంట రమణ, కిష్టా, క్లస్టర్ ఇన్‌చార్జ్ రాము, డీలర్ రాజా పాల్గొన్నారు.

●కనగానపల్లి: మండలకేంద్రంతో పాటు చంద్రాచెర్ల గ్రామంలో మీ సమస్య- మా బాధ్యతను నిర్వహించారు. డీసీఎంఎస్, మార్కెట్ యార్డు చైర్మన్లు నెట్టెం వెంకటేష్, సుధాకర్‌చౌదరి పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. పార్టీ మండల కన్వీనర్ యాతం పోతలయ్య , ఎంపీడీఓ అనిల్‌కుమార్, సర్పంచ్ అంకే రామక్రిష్ణ, ఎంపీటీసీ బిల్లే భాస్కర్, నాయకులు బట్టా సురేష్‌చౌదరి, రామసుబ్బయ్య, బిల్లే దాము, రాజాక్రిష్ణ, అంకే మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

●ఆత్మకూరు: తలుపూరు, వడ్డుపల్లి గ్రామాల్లో టీడీపీ నాయకులు మీ సమస్య -మా బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. మండల కన్వీనర్ శ్రీనివాసులు, రాష్ట్ర తెలుగుయువత ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి, పార్లమెంటు అధికార ప్రతినిధి శశాంక్ చౌదరి, క్లస్టర్ ఇన్‌చార్జిలు క్రిష్ణమోహన్ చౌదరి, వెంకటనారాయణ, ప్రధాన కార్యదర్శి నరసింహచౌదరి, నాయకులు వెంకటేసులు, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లినిక్‌పై దాడి ఘటనలో ఐదుగురి అరెస్టు

అనంతపురం క్రైం, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): నగరంలోని సాయినగర్‌లో ఉన్న అస్ర ఐ కేర్ క్లినిక్‌పై దాడి చేసిన ఘటనలో ఐదుగురిని అరెస్టు చేసినట్టు అనంతపురం టూ టౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ పేర్కొన్నారు. ఈనెల 9వ తేదీన క్లినిక్‌పై దాడి జరిగిందన్నారు. ఇందులో నిందితులను సోమవారం మధ్యాహ్నం అరెస్టు చేసి రిమాండ్ కోసం కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. ముద్దాయిలు శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం కుంటిమద్దికి చెందిన శ్రీశైలం శివశంకర్, సీకేపల్లి మండలం నాగసముద్రానికి చెందిన గండ్లూరి వెంకటరమణ, రామగిరి మండలం పాపిరెడ్డిపల్లికి చెందిన మురికి పృథ్వీ, అనంతపురం నగరంలోని బుడ్డప్ప నగర్‌కు చెందిన బంగారు అనిల్‌కుమార్, రామగిరికి చెందిన ఆది ఆంధ్ర మారుతీని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ఎవరైనా దౌర్జన్యాలకు పాల్పడి శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే..కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సీఐ హెచ్చరించారు.

'నేచురల్ ఫార్మింగ్‌కు రైతులను ప్రోత్సహించాలి'



మాట్లాడుతున్న ఏడీ అల్తాఫ్ అలీఖాన్

అనంతపురంరూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతులను నేచురల్ ఫార్మింగ్ చేయుటకు ప్రోత్సహించాలని అనంతపురం డివిజన్ వ్యవసాయాధికారి అల్తాఫ్ అలీఖాన్ సూచించారు. మండలంలోని కక్కలపల్లి రైతు సేవా కేంద్రంలో సోమవారం జీరో బేస్ నేచురల్ ఫార్మింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందుకు అల్తాఫ్ అలీఖాన్‌తో పాటు జడ్పీఎస్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లక్ష్మానాయక్ హాజరయ్యారు. అలీఖాన్ మాట్లాడుతూ.. ఎరువులు, పురుగుల మందులు వాడకుండా భూమిని సారవంతం చేయడానికి పీఎండీఎస్ పద్ధతి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ పద్ధతి వల్ల భూములు సారవంతం అవుతాయన్నారు. కనుక రైతులను నేచురల్ ఫార్మింగ్ చేసేలా రైతుసేవా కేంద్రం సిబ్బంది పోత్సహించాలని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీఎస్ఎఫ్ సిబ్బంది, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతు సేవాకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్కేయూలో పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ అనిత

అనంతపురంరూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): భారత దేశంలో భూసేకరణ- ప్రధానంగా ఆంధ్రప్రదేశ్‌లోని భూ యజమానులకు నష్టపరిహారం చెల్లించటం అనే పుస్తకాన్ని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. న్యాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీరాములు పర్యవేక్షణలో డాక్టర్ బీ. వెంకటేశ్వర్లు ఈ పుస్తకాన్ని రచించారు. విశ్వవిద్యాలయంలో వైస్‌చాన్సలర్ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబు చేతుల మీదుగా ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆచార్య శ్రీనివాసన్, ఆచార్య బాస్కర్‌రెడ్డి, డాక్టర్ తిమ్మయ్య, డాక్టర్ శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యావ్యవస్థను పటిష్టపరచాలి: ఏఐడీఎస్ఓ



టవర్‌క్లాక్ వద్ద నిరసన చేస్తున్న ఏఐడీఎస్ఓ నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థను పటిష్టపరిచి, ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏఐడీఎస్ఓ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక టవర్‌క్లాక్ వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. తొలుత ప్రభుత్వ జీఓ ప్రతులను దహనం చేశారు. అనంతరం ఏఐడీఎస్ఓ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు హరీష్‌కుమార్ రెడ్డి, మహేష్ మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ కొత్తగా తీసుకువచ్చిన జీవీలో కేవలం పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు మినహా ఎవరినీ పాఠశాలల్లోకి అనుమతించరాదని పేర్కొనడం దారుణమన్నారు. విద్యార్థి సమస్యలపై పోరాడే విద్యార్థిసంఘాలను అణిచివేసేందుకు ఈ కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. ఫీజుల పేరుతో కోట్లాది రూపాయలు దోచుకుంటున్న ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థలకు ప్రభుత్వమే వత్తాసు పలుకుతోందని విమర్శించారు. విద్యాశాఖ జారీ చేసిన జీఓను వెనక్కు తీసుకుని ప్రభుత్వ విద్యావ్యవస్థను పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఏఐడీఎస్ఏ నగర కార్యదర్శి చరణ్‌తేజ్, నాయకులు సురేష్, అభిలాష్, త్రినాథ్, సంతోష్, పూజిత, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్‌పోటీలకు పల్లవి



అనంతపురం విద్య, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): బుక్కరాయసముద్రం జెడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థిని పల్లవి క్రీడారంగంలో రాణిస్తోంది. పదోతరగతి చదువుతున్న ఈమె బాస్కెట్‌బాల్ పోటీలలో జిల్లాస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. దీంతో ఈనెల 13వతేదీన బుధవారం తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననుంది. బీకేఎస్‌హైస్కూల్ హెచ్ఎం వసుంధర, పీడీలు రాజశేఖరరెడ్డి,లలిత, ఇతర టీచర్లు సోమవారం ఆనందం వ్యక్తం చేస్తూ పల్లవిని అభినందించారు.

ఇద్దరిపై కేసు నమోదు

రాప్తాడు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): బొమ్మేపర్తి గ్రామంలోని భూవివాదంలో ఇద్దరిపై కేసు నమోదైందని రాప్తాడు సీఐ శ్రీహర్ష తెలిపారు. గ్రామంలోని సర్వే నెంబర్ 56-2లో 3.37 ఎకరాల భూమి విషయంలో ఆ గ్రామానికి చెందిన డొక్కా ప్రభాకర్‌కు, డొక్కా అంజన్‌కుమార్‌కు, డొక్కా రేణుకమ్మకు కొన్నేళ్ల నుంచి వివాదం జరుగుతోంది. ఆ భూమి సమస్య కోర్టులో నడుస్తోంది. కాగా డొక్కా ప్రభాకర్ ఆ భూమిలో బోరు వేసుకుని విద్యుత్ సరఫరా కోసం ఈ నెల 7న లైన్‌మెన్ కిరణ్‌ను పొలానికి పిలుచుకెళ్లి ఎస్టిమేషన్ వేయిస్తుండగా డొక్కా రేణుకమ్మ, ఆమె కుమార్తె జయలక్ష్మి, కోడలు వాణి వెళ్లి అడ్డుకున్నారు. దీంతో డొక్కా ప్రభాకర్ అసభ్య పదజాలంతో వారిని దూషించారు. దీనిపై అదే రోజున రాప్తాడు పోలీస్ స్టేషన్‌లో డొక్కా రేణుకమ్మ ఫిర్యాదు చేశారు. కాగా సోమవారం ఉదయం డొక్కా రేణుకమ్మ గ్రామంలో బుక్కచెర్లకు వెళ్లే రోడ్డులో నిలబడి ఉండగా డొక్కా ప్రభాకర్, డొక్కా అంజన్‌కుమార్ దాడికి పాల్పడ్డారు. దీంతో రేణుకమ్మ వారిద్దరి వల్ల తమకు ప్రాణహాని ఉందని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పీజీఆర్ఎస్‌కు 460 వినతులు

● స్వీకరించిన ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ



వినతులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జ్‌కలెక్టర్ ఇతర అధికారులు

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో ప్రజలు వినతుల ద్వారా తెలియజేసిన సమస్యల్ని పెండింగ్ లేకుండా వెంటనే పరిష్కరించాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ శివ నారాయణ శర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 460 వినతులు అందాయి. ఇన్ చార్జి కలెక్టర్‌తో పాటు అసిస్టెంట్ కలెక్టర్ సచిన్‌రహర్, డీఆర్‌ఓ మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్, రామ్మోహన్, మల్లికార్జునుడు, మల్లిఖార్జున్ రెడ్డి, పౌరసరఫరాలశాఖ డీఎం రమేష్‌రెడ్డి వినతులు స్వీకరించారు.

ఇందులో పలు వినతులను పరిశీలిస్తే.. బుక్కరాయసముద్రానికి చెందిన రమణమ్మ తన భర్తతో కలిసి ప్రజాసమస్యల పరిష్కార వేదికలో భూసమస్యపై అధికారులకు విన్నవించుకుంది. కార్యాలయాల చుట్టూ తిరిగి తన భర్త అనారోగ్యం క్షీణించిందని, న్యాయం చేయాలని కోరింది. అలాగే దశాబ్దాల కాలంగా లేని రస్తా కోసం కొందరు దౌర్జన్యం చేస్తున్నారని గుంతకల్లు మండలం వైటీ చెరువుకు చెందిన సుకన్య అధికారులకు ఫిర్యాదు చేసింది. న్యాయం చేయాలని కోరింది. ఇక మహిళా సంఘాలకు చెందిన డబ్బు యానిమేటర్లు మేసేశారని పలువురు మహిళలు అధికారులకు ఫిర్యాదు చేశారు. అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లికి చెందిన ఓ సంఘం పరిధిలో యానిమేటర్ రూ.30లక్షలు మోసం చేసిందని అధికారులకు వివరించారు. పామిడి మండల కేంద్రంలో ఓ వ్యక్తి రూ.12లక్షలు మహిళలకు అందకుండా వాడుకున్నాడని ఆరోపించారు. అదేవిధంగా సమగ్ర శిక్ష కార్యాలయంలో సెక్టోరియల్ అసిస్టెంట్ సెక్టోరియల్ ఆఫీసర్ భర్తీలో స్కూల్ అసిస్టెంట్లకు ప్రాధాన్యత ఇవ్వాలని రిజర్వేషన్ సాధికారిక పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఉజ్వల్ కోరారు.

రెండోరోజూ.. ఆరాధనోత్సవాలు



భక్తులకు పండ్లు అందజేస్తున్న రవీంద్ర స్వామీజీ

అనంతపురం క్రైం, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని విన్సెంట్ ఫెర్రర్ నగర్‌లో గల సద్గురు రవీంద్ర స్వామీజీ నివాసంలో జగద్గురు రాఘవేంద్ర స్వామి ద్వితీయ ఆరాధనోత్సవాలు రెండోరోజైన సోమవారం కూడా ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి రాత్రి వరకూ రాఘవేంద్రస్వామి, వేంకటేశ్వరస్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రవీంద్ర స్వామీజీ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు శ్రీ గంధం, కుంకుమ, పండ్లను ప్రసాదంగా అందించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ.. మంత్రాలయ రాఘవేంద్రస్వామి నేటికీ బృందావనంలో సజీవంగా ఉన్నారని, భక్తులను కటాక్షిస్తున్నారని తెలిపారు. తర్వాత కరుట్లపల్లి, కూడేరు,ఆత్మకూరు, చోళసముద్రం,గార్లదిన్నె, అనంతపురం, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. మంగళవారం రాఘవేంద్రస్వామి తృతీయ ఆరాధనోత్సవాలు నిర్వహించనున్నారు.

ఎస్పీకి రాఖీ కట్టిన బ్రహ్మకుమారీలు



ఎస్పీకి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి

అనంతపురం క్రైం, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద సోమవారం బ్రహ్మకుమారిలు ఎస్పీ జగదీశ్‌ను కలిసి రాఖీ కట్టారు. ఈ సందర్భంగా ఆయన వారికి రాఖీ శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్రాన్ని నాశనం చేసింది జగనే: టీడీపీ

ఆత్మకూరు ఆగస్టు 11(ఆంధ్ర జ్యోతి):రాష్ట్రాన్ని నాశనం చేసింది మాజీ సీఎం జగనేనని, ఈ విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని టీడీపీ మండల టీడీపీ కన్వీనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలకేంద్రంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటినుంచి అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. వాటిని చూసి ఓర్వలేక వైసీపీ వారు తరచూ ప్రెస్‌మీట్లు పెట్టి విషం కక్కుతున్నారని మండిపడ్డారు. గత ఐదేళ్ల వైసీపీలో అప్పటి సీఎం జగన్ రాష్ట్రాన్ని సర్వ నాశనం చేశారన్నారు. ఆ విషయం ప్రజలందరికీ తెలుసని, అందుకే 11 సీట్లు కట్టబెట్టారని దుయ్యబట్టారు. తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కనీసం సొంత ఊరుకు రోడ్డు వేయలేకపోయారని అన్నారు. పరిటాల సునీతమ్మ ఎమ్మెల్యే అయ్యాక ఏడాదిలోనే నియోజకవర్గంలో రూ. 20కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. నాయకులు శశాంక చౌదరి, కందుళ ఓబుళపతి, వెంకటనారాయణ, వెంకటేశులు ,తదితరులు పాల్గొన్నారు.

'రోత రాతలు.. సరి కాదు'

అనంతపురం క్రైం, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి) : అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ జన్మదినం సందర్భంగా ఆయన అభిమానులు, టీడీపీ నాయకులు శుభాకాంక్షలు తెలుపుతూఫ్లెక్సీలు కట్టుకుంటే జగన్ పత్రికలో రోత రాతలు రాయడం సరికాదంటూ స్టోర్ డీలర్ల సంఘం నాయకులు మండిపడ్డారు. నగరంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం స్టోర్ డీలర్ల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు బోయ శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి రాము, టీడీపీ వాల్మీకి బోయ సాధికార రాష్ట్ర సమితి నాయకులు మణిరవి మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. స్టోర్ డీలర్ల నుంచి బలవంతపు వసూళ్లు అంటూ జగన్ పత్రికలో వార్తలు రాయడం సబబుకాదన్నారు. ఇందుకు మీ వద్ద ఏం ఆధారాలున్నాయని ప్రశ్నించారు..? ఎవరు చెబితే ఈ వార్తలు రాశారంటూ మండిపడ్డారు. అర్బన్ ఎమ్మెల్యేపై విషం చిమ్మడం సరికాదన్నారు. అనంతపురం అర్బన్‌లో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే...ఇలా కొందరు నాయకులు కుట్రలు పన్నుతున్నారంటూ అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి రాతలు మరోసారి రాస్తే ఊరుకోమంటూ హెచ్చరించారు. డీలర్లు నారాయణస్వామి, శ్రీనివాసులు, దలవాయి వెంకటేష్, జయప్రకాష్, బాలా మహేష్, కులందర్, బాలాజీ, హేమంత్, భరత్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ తనిఖీ

అనంతపురం క్రైం, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను డీసీ నాగమద్దయ్య ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్(ఎన్‌ఫోర్స్‌మెంట్) శ్రీరామ్‌తో కలిసి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నవోదయం 2.0 అమలు తీరుపై అక్కడి అధికారులు, సిబ్బందితో ఆరా తీశారు. అలాగే నాటు సారా ప్రభావిత గ్రామాలను గ్రీన్ గ్రామాలుగా మార్చేందుకు చేపట్టాల్సిన చర్యలపై సూచనలు చేశారు. త్వరలో రాబోయే బార్ పాలసీ అమలు నేపథ్యంలో అనంతపురంలోని బార్లకు సంబంధించి ఎలాంటి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలో వివరించారు. అదేవిధంగా గంజాయి నేరాలకు తావుండే ప్రాంతాల్లో తనిఖీ చేయాలని, డ్రగ్స్, గంజాయి పెడ్లర్స్ పై నిఘా పెట్టి పట్టుకోవాలని సూచించారు. సీఐ సత్యనారాయణ, ఎస్ఐలు జయనరసింహ, జాకీర్ హుస్సేన్, కృష్ణారెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



ఎక్సైజ్ అధికారులతో మాట్లాడుతున్న డీసీ నాగమద్దయ్య

ఇళ్ల మధ్యలో విద్యుత్ స్తంభం

- గోడలకు కరెంట్ ప్రవాహం
- 20 ఏళ్లుగా భయం భయంగా జీవనం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

గుంతకల్లుటౌన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పాత గుంతకల్లులోని వాల్మీకి విగ్రహం పక్కన ఇళ్ల మధ్యలో 11కేవీ తీగల కోసం ఇనుప విద్యుత్ స్తంభాన్ని ట్రాన్స్‌కో అధికారులు ఏర్పాటు చేశారు. దానికి స్ట్రీట్ లైట్ ఏర్పాటు చేశారు. గాలి, వాన వస్తే ఆ ఇళ్లలోని ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్నారు. గాలికి విద్యుత్ తీగలు ఒకదానికొకటి తగిలి మంటల వ్యాపించి నిప్పురవ్వలు కిందపడుతున్నాయి. ఇక వర్షం వస్తే ఇంటి గోడలకు కరెంట్ ప్రసారం అవుతోంది. 20 సంవత్సరాల నుంచి ఈ విద్యుత్ స్తంభాన్ని మార్చాలని విద్యుత్ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులకు స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.


ఇళ్ల మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం

నిప్పురవ్వలు పడుతున్నాయి


గాలి, వాన వస్తే నిప్పురవ్వలు కింద పడటంతో ఇంట్లోలో నుంచి బయటకు కాలుపెట్టాలంటే భయంగా ఉంది. వాన వస్తేగోడలకు పట్టుకుంటే షాక్ కొడుతుంది. ఎప్పుడూ ఏ ప్రమాదం జరుగుతుందని భయాందోళన చెందుతున్నాం. స్తంభానికి చాలా వైర్లు ఏర్పాటు చేయడంతో తేమ తగిలితే షాక్ వస్తోంది. అధికారులు ఆ విద్యుత్ స్తంభం తొలగించి మా ప్రాణాలు కాపాడాలి.

\- ఈకమ్మ, వాల్మీకి సర్కిల్ కాలనీ

విద్యుత్ స్తంభం తొలగించాలి


చిన్నపాటి గాలికి విద్యుత్ తీగల రాపిడికి నిప్పు రవ్వలు పడుతున్నాయి. మా మట్టి మిద్దెపైన ఎక్కాలంటే ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది. విద్యుత్ స్తంభానికి సర్వీస్ వైర్లు వేలాడుతున్నాయి. గాలికి అవి తెగి ఎక్కడ మీద పడుతాయని భయంతో ఇంట్లోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రమాదం జరగక ముందే ఆ విద్యుత్ స్తంభంను తొలగించాలి.

\- షాజాదీ, వాల్మీకి సర్కిల్ కాలనీ

చర్యలు తీసుకుంటాం

ఇళ్ల మధ్య ఉన్న విద్యుత్ స్తంభాన్ని తన సిబ్బందితో కలసి పరిశీలిస్తాం. విద్యుత్ స్తంభం డ్యామేజ్ ఉందా, ఇతర ప్రాంతంలో మార్చాలా, మార్చేందుకు వీలుంటే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

\- ఏడీఈ నాగేంద్ర

న్యూస్ బాక్స్

పెన్నానదికి హారతి


హారతి ఇస్తున్న అర్చకులు

తాడిపత్రి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా పెన్నానదికి నీరు రావడంతో బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం ప్రధాన అర్చకుడు రవిశర్మ, శంకరయ్యశర్మ, గిరిష్‌శర్మ, బాలానందశర్మ పెన్నానదిలో గంగాహారతి కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చంద్రమోహన్, శ్రీనివాసులు, రంగనాథ, చిట్టిబాబు పాల్గొన్నారు.

నేమకల్లులో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం


ధ్వజపట ఆరాధన నిర్వహిస్తున్న అర్చకులు

బొమ్మనహాళ్, ఆగస్టు11, (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లులో శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణ మాసం బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు సోమవారం ధ్వజపట ఆరాధనను వైభవంగా నిర్వహించారు. అర్చకులు అనిల్‌కుమార్‌చార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు.

భోగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

పామిడి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలసిన భోగేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గర్భాలయంపై విమాన గోపురం నిర్మాణానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా తిమ్మప్పస్వామి కల్యాణం



గుత్తిరూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బసినేపల్లిలో శ్రీదేవి భూదేవి సమేత గద్దిరాళ్ల తిమ్మప్ప స్వామి కల్యాణాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున స్వామి వారికి పంచామృతాభిషేకం వివిధ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 10 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత తిమ్మప్ప స్వామికి కల్యాణం నిర్వహించారు. సాయంత్రం స్వామి వారిని గ్రామంలో ఊరేగించారు.

వెండి ఆభరణాల వితరణ


వెండి ఆభరణాలను అందజేస్తున్న భక్తుడు

కుందుర్పి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని అపిలేపల్లి గ్రామానికి చెందిన రాఘవేంద్ర సోమవారం రూ.లక్ష విలువ చేసే వెండి ఆభరణాలను వితరణ చేశారు. ఇతను అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా స్థిరపడ్డాడు. సొంత గ్రామానికి ఆంజనేయస్వామికి రూ. 51 వేలు విలువ గల వెండి ఆభరణాలను.. పీర్ల స్వామికి రూ. 50 వేలను గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అందజేశారు.

సింగిల్‌విండో అధ్యక్షుడిగా అనీల్‌కుమార్



యల్లనూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండల సింగిల్‌విండో అధ్యక్షుడిగా తరిగోపుల అనిల్‌కుమార్‌చౌదరిని, సభ్యులుగా సుబ్బరాయుడు, రామును ప్రభుత్వం నియమించినట్లు మండల కన్వీనర్ రామాంజనేయులు సోమవారం తెలిపారు. వీరు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి కృతజ్ఞతలు తెలిపారు.

త్రిసభ్య కమిటీ నియామకం

కణేకల్లు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక రూరల్‌బ్యాంక్ రాష్ట్ర ప్రభుత్వం త్రిసభ్య కమిటీని నియమించింది. సొసైటీ ఛైర్మన్‌గా నాగార్జున, సభ్యులుగా చిన్న ఈరప్ప, తిప్పేస్వామిని నియమించింది.

ఎస్‌ఐ-2గా నాగప్ప

గుత్తి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఎస్‌ఐ-2గా నాగప్ప బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ ఆశాబేగం బదిలీపై కర్నూలుకు వెళ్లారు. ఆమె స్థానంలో గుత్తి జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప ఇక్కడ బాధ్యతలు చేపట్టారు.

సీపీఐ మండల కార్యదర్శిగా రాము రాయల్

గుంతకల్లు టౌన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): సీపీఐ మండల కార్యదర్శిగా రాము రాయల్, సహాయ కార్యదర్శిగా రామాంజినేయులు యాదవ్ నియమితులయ్యారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం సీపీఐ 14వ మహాసభను రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డీ జగదీష్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. మండల కమిటీని ఎంపిక చేశారు.

పోస్టర్ ఆవిష్కరణ

గుంతకల్లు టౌన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీశంకరానంద గిరిస్వామి డిగ్రీ కళాశాలలో సెప్టెంబరు 25, 26 తేదీల్లో నిర్వహించే జాతీయ స్థాయి సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను కళాశాల కరస్పాండెంట్ కేసీ హరికుమార్ సోమవారం ఆవిష్కరించారు. ఇన్నోవేషన్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్, ట్రెండ్స్, చాలెంజెస్ అండ్ ఆపర్చునిటీస్ అనే విషయంపై జాతీయ స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పనులను పరిశీలించిన మానిటరింగ్ బృందం

విడపనకల్లు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్తూరు, గాజుల మల్లాపురం. జనార్ధనపల్లి గ్రామాల్లో ఎన్ఎల్ఎం టీం (జాతీయ లెవెల్ మానిటరింగ్ బృందం) సభ్యులు సోమవారం పర్యటించారు. గోకులం షెడ్లులను, వైసీపీ ప్రభుత్వంలో నిర్మించిన ఇళ్లను, ఉపాధి పనులను వివిధ రికార్డులను పరిశీలించారు. పాల్తూరులో పనులను ఎన్ఎల్ఎం టీం సభ్యులు సాంబశివరావు, నిత్యా, డ్వామా పీడీ సుధాకర్‌రెడ్డి, జడ్పీసీఈఓ శివశంకర్‌తో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ షకీలా బేగం, ఏఓ భాస్కర్ బాబు, ఈఓఆర్డీ సత్యబాబు, జనార్ధనపల్లి సర్పంచ్ జనార్ధనాయుడు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

పెళ్లి పేరుతో మోసం.. కేసు నమోదు

గుత్తి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పెళ్లి పేరుతో మోసం చేసి.. తనపై అత్యాచారం చేశాడని పట్టణానికి చెందిన ఓ యువతి ఫిర్యాదు మేరకు పుట్లూరు మండలం కడవకల్లుకు చెందిన గంగాధర్‌ను సోమవారం రాత్రి పోలీసులు అరెస్ట్ చేశారు. జోడి యాప్ ద్వారా వీరి మధ్య పరిచయం ఏర్పడింది. ఈ నెల ఏడున గార్లదిన్నె మండలంలోని ఓ దేవాలయంలో వివాహం చేసుకున్నారు. రెండు రోజులు కలిసి జీవించారు. అనంతరం తన తల్లిదండ్రులతో మాట్లాడి వస్తానని వెళ్లిన గంగాధర్ .. అనంతరం వచ్చి ఇంట్లో వారు ఒప్పుకోలేదని ఆ యువతిని వదిలేశాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు గంగాధర్‌ను అరెస్ట్ చేశారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలి


కుందుర్పిలో ధర్నా చేస్తున్న జేఏసీ నాయకులు, ఆర్డీటీ సిబ్బంది

కుందుర్పి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలని మండల కేంద్రంలో ఆర్డీటీ జేఏసీ నాయకులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద గంటపాటు నిరసన చేపట్టారు. తహసీల్దార్ ఓబులేష్‌కు వినతి పత్రం అందజేశారు.

● యాడికి : ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలని పలువురు గ్రామస్థులు సోమవారం యాడికిలో ర్యాలీ నిర్వహించారు. వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు. ఇందులో నరసింహులు, శ్రీరాములు, బాలు, సూర్యుడు, నాగరాజు, రంగస్వామి పాల్గొన్నారు.

● విడపనకల్లు: ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ ను రెన్యువల్ చేయాలని మండలంలోని వివిధ గ్రామాల మహిళలు, దళిత సంఘం నాయకులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. తహసీల్దారు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. తహసీల్దారు రమాదేవికి వినతి పత్రాన్ని అందించారు.

● బొమ్మనహాళ్: ఆర్డీటీకి వెంటనే ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేయాలని తహసీల్దార్ కార్యాలయం వద్ద కురవళ్లి, చంద్రగిరి, గౌనూరు గ్రామాల ప్రజలు ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో ఆర్డీటీ సంఘం ఉపాధ్యాయులు గోవిందు, ఎర్రిస్వామి, బసవరాజు పాల్గొన్నారు.

పాఠశాలలో బోరు ఏర్పాటు


బోరు వేయిస్తున్న టీడీపీ నాయకులు

డీ.హీరేహాళ్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చాలా నెలలుగా తాగడానికి నీరు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని ఇటీవల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు వెంటనే కొత్త బోరు ఏర్పాటు చేయాలని నాయకులు, అధికారులను ఆదేశించారు. దీంతో సోమవారం మార్కెట్ యార్డ్ ఛైర్మన్ హనుమంతరెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగళ్లి రాజు, మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి ఆ పాఠశాలలో బోర్ వేయించారు. అక్కడ పుష్కలంగా నీరు పడ్డాయి. బోరు మోటారు, విద్యుత్‌ను రెండు రోజుల్లో ఏర్పాటు చేస్తామని ఆ నాయకులు తెలిపారు.

పాఠశాల ఆవరణలో పీహెచ్‌సీ వద్దు

కళ్యాణదుర్గంరూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కుందుర్పి మండలం ఎనుములదొడ్డి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయరాదని ఆ గ్రామస్థులు సోమవారం ఆర్డీఓ వసంతబాబుకు వినతి పత్రాన్ని అందజేశారు. గతంలో దీనిపై వారు హైకోర్టును ఆశ్రయించగా... నిర్మాణాన్ని ఆపాలని ఆదేశించింది. అయితే ఇటీవల పాఠశాల ఆవరణంలోనే పీహెచ్‌సీ ఏర్పాటుకు పనులు చేపట్టారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఆ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని వారు ఆర్డీఓను కోరారు.

సూర్య ఘర్ యోజనపై అవగాహన

గుంతకల్లుటౌన్, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): స్థానిక నామాల సేట్ ఫంక్షన్‌హాల్‌లో ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజనపై అవగాహన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోమవారం నిర్వహించారు. రాష్ట్రంలో విద్యుత్ చార్జీల భారం తగ్గించేందుకు ప్రధాన మంత్రి సోలార్ విద్యుత్‌ను తీసుకువచ్చారని, దీన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, మున్సిపల్ కమిషనర్ నయీమ్‌అహ్మద్, సింగిల్ విండో అధ్యక్షుడు తలారి మస్తానప్ప, టీడీపీ మండల కన్వీనర్ రామన్నచౌదరి పాల్గొన్నారు.

శ్మశానవాటిక దారిని బాగుచేయండి

రాయదుర్గంరూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బళ్లారిరోడ్డులో ఉన్న ఈద్గా, శ్మశానవాటికకు వెళ్లే మార్గంలో కాలువపై ఉన్న బండలు పలుమార్లు విరిగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని, మరమ్మతులు చేయించాలని ప్రభుత్వ ఖాజీ మహమ్మద్ సైఫుల్లా, మహ్మద్, రఫీక్, ఫక్రుద్దీన్ కోరారు. సోమవారం ఈ విషయంపై కమిషనర్ దివాకర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. మృతదేహాలను శ్మశానవాటికకు తీసుకెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు.

రోడ్డుపై మురుగునీరు

బ్రహ్మసముద్రం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలో పడమటి కోడిపల్లి గ్రామంలో రోడ్డుపైనే మురుగునీరు నిల్వ ఉంటోంది. ఆ నీరు పాచి.. పట్టి.. దుర్వాసన వస్తుండటంతో పాటు.. దోమలకు నిలయంగా మారింది. దీంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు.


రోడ్డుపై నిల్వ ఉన్న మురుగునీరు

రాఘవేంద్రస్వామికి విశేష పూజలు


యాడికిలో అలంకరణ

కణేకల్లు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రహ్మపురి నరసింహస్వామి ఆలయంలో రాఘవేంద్రస్వామి ఆరాధన మహోత్సవాల్లో భాగంగా సోమవారం మధ్యారాధన పూజలు నిర్వహించారు. బృందావనానికి కవచ అలంకరణ చేసి తులసీ మాల పుష్పాలంకరణ చేశారు.

● తాడిపత్రి :స్థానిక రాఘవేంద్రస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి ఆరాధనోత్సవాలు వైభవంగా జరిగాయి. స్వామివారి బృందావనాన్ని వివిధ పుష్పాలతో విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు.

● యాడికి: రాఘవేంద్రస్వామి ఆరాధన ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక రాఘవేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు భారీగా తరలివచ్చారు.

● గుత్తిరూరల్: మండలంలోని ఇసురాళ్లపల్లిలో ఆనంద ఆశ్రమంలో గురు రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. రాఘవేంద్రస్వామి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఊరేగించారు. రాత్రి ఆశ్రమంలో నాటకలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు.

చిక్కింది చేప..


వంకలో పట్టుకున్న చేపలు

యాడికి, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములపాడు గ్రామం వద్ద ఉన్న చిన్న వంక వర్షాలకు పారుతోంది. అందులో సోమవారం పెద్ద పెద్ద చేపలు వచ్చాయి. స్థానికులు వాటిని పట్టుకుని, ఆనంద పడుతున్నారు. ఒక్కో చేప రెండు నుంచి మూడు కిలోల వరకు బరువు ఉన్నాయని వారు చెబుతున్నారు. చేపలను పట్టుకుని సోషల్ మీడియాలో పెడుతుండడంతో వైరల్ అవుతున్నాయి. వంక పెండేకల్లు డ్యాంకి అనుసంధానంగా ఉంది. డ్యాంలోని చేపలు వంకలో వస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

మురుగునీరు వెళ్లేలా చర్యలు తీసుకోండి


మల్లికేతి రోడ్డు పక్కన కాలువ

బొమ్మనహాళ్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో మల్లికేతి రోడ్డులో సీసీ రోడ్డు పక్కన మట్టిని ఓ వ్యక్తి తన అవసరం కోసం తవ్వి మురుగునీరు వెళ్లేలా చేశారు. అయితే ఆ కాలువను పూర్తిగా ఏర్పాటు చేయక పోవడంతో ము రుగునీరు నిల్వ ఉంటోందని, దీంతో ఆ ప్రాంత వాసులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారని మాజీ ఎంపీటీసీ సభ్యురాలు ఇందిరమ్మ సోమవారం సాయంత్రం వాపోయారు. వర్షం వచ్చినప్పుడు నీరు ముందుకు కదలడం లేదని, కొందరు సెప్టిక్ ట్యాంక్ నీటిని ఆ కాలువలోకి పంపింగ్ చేస్తున్నారని అన్నారు. అధికారులు స్పందించి ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.


బీటీపీలో 1,650 అడుగులకు చేరిన నీటిమట్టం

గుమ్మఘట్ట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): భైరవానితిప్ప రిజర్వాయర్‌లో వరదనీటి ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో సోమవారం సాయంత్రానికి 1,650 అడుగుల నీటిమట్టం చేరింది. కర్ణాటక ప్రాంతంలో జోరుగా వర్షాలు కురుస్తుండడంతో వేదావతి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. మూడురోజుల్లో ఒక టీఎంసీ మేర వరదనీరు చేరినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. బీటీపీ సామర్థ్యం రెండు టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.3 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇదే విధంగా వారం పాటు వరద కొనసాగితే రిజర్వాయర్ నిండుతుందని అధికారులు భావిస్తున్నారు.

ఔట్‌ఫ్లో 2,090 క్యూసెక్కులు

బెళుగుప్ప, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌లోకి ఇన్‌ఫ్లో 2,130 క్యూసెక్కులు ఉండగా.. ఔట్‌ఫ్లో 2,090 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు సోమవారం తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.811 టీఎంసీల నిల్వ ఉందన్నారు.

మేనేజర్ లేక పాట్లు


ఖాళీగా ఉన్న బీఎం కుర్చీ

బెళుగుప్ప, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక యూనియన్ బ్యాంకు మేనేజర్ నాగరాజు పుట్టపర్తికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో హైదరాబాద్ నుంచి ఆనంద్‌ను నియమించారు. 20 రోజులుగా ఆయన సెలవులో ఉండటంతో ఆర్థిక లావాదేవీలు కుంటుపడ్డాయి. రుణాలు మంజూరుకు తప్పనిసరిగా బ్యాంకు మేనేజర్ సంతకం కావాలి. దీంతో ఆయన సంతకం కోసం పలువురు రోజూ బ్యాంకుకు రావడం... వెనుతిరగడం జరుగుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ సమస్యకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఖాతాదారులు కోరుతున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉరవకొండ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మి నర సింహస్వామి దేవస్థానం పాలక మండలి సభ్యుల నియామ కానికి నోటిఫికేషన్ జారీ అయినట్లు ఈఓ రమేష్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు కుల ధ్రువీకరణ, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలను కార్యాలయంలో అందజేయాలన్నారు. వివరాలకు కార్యానిర్వహణ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

క్రైం న్యూస్..

ఒంటరితనం భరించలేక వ్యక్తి ఆత్మహత్య

బ్రహ్మసముద్రం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్నేపల్లి గ్రామానికి చెందిన హరిజన హనుమంతు(42) ఆదివారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మూడేళ్ల క్రితం భార్య మల్లక్క మరణించింది. అప్పటి నుంచి హనుమంతు ఒంటరితనంతో మనోవేదనకు గురవుతున్నాడు. తన ఇద్దరు కుమారులకు పెళ్లిళ్లు చేయలేకపోయాడు. ఒంటరితనం భరించలేక మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ నరేంద్ర కుమార్ తెలిపారు.

మట్కాబీటర్ల అరెస్ట్

తాడిపత్రి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ సమీపంలో సోమవారం మట్కా నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వారి నుంచి రూ. 1.30 లక్షలను స్వాధీనం చేసుకున్నామని, వారిపై కేసు నమోదు చేశామని అన్నారు.



దుర్గంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్

ఉత్సాహంగా 'హర్ ఘర్ తిరంగా'

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్ : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని పలు ప్రాంతాల్లో సోమవారం తలపెట్టిన 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. కళ్యాణదుర్గంలో మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. గుంతకల్లులో మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ చేపట్టారు. రాయదుర్గంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జింకా వసుంధరదేవి, కన్వీనర్ హీరోజీరావు ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. బొమ్మనహాళ్ తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ విజయభాస్కర్ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ నిర్వహించారు. గుత్తిలో మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మీయా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కణేకల్లులో తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీఓ చంద్రమౌళి, టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, బీటీ రమేష్, చంద్రశేఖర్‌గుప్తా ఈ ర్యాలీ నిర్వహించారు. పామిడిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులు 600 మీటర్ల జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. ఇందులో ఎంపీడీఓ తేజోత్స్న, డిప్యూటీ ఎంపీడీఓ అశ్వర్థమ నాయుడు, కూటమి నాయకులు శ్రీనివాసరెడ్డి, అంకాల్ రెడ్డి, అంజి నాయక్ పాల్గొన్నారు.

రేపు భారీ ర్యాలీ

గుంతకల్లుటౌన్ : స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీని భారీగా నిర్వహిస్తున్నట్లు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అంకాల్ రెడ్డి తెలిపారు. స్థానిక ఇల్లూరు లక్ష్మీనారాయణ భవనంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఉదయం 10 గంటలకు రైల్వే క్రీడామైదానం నుంచి పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఇందులో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి, జిల్లా, రాష్ట్ర నాయకులు పాల్గొంటారన్నారు.

రోటరీ క్లబ్‌కు అవార్డుల పంట


అవార్డులు అందుకున్న సభ్యులు

తాడిపత్రి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి రోటరీక్లబ్ అందించిన సేవలకు గాను పలు అవార్డులు వచ్చాయని అధ్యక్షుడు కిషోర్‌కుమార్ సోమవారం తెలిపారు. 2024-25 సంవత్సరానికి గాను సత్యసాయి జోన్‌లో ఉత్తమ రోటరీక్లబ్ అధ్యక్షుడిగా పీవీ సుబ్రమణ్యం, ఉత్తమ కార్యదర్శిగా మహమ్మద్‌రఫీ, ఉత్తమ డిస్ట్రిక్ ఇంటరాక్ట్ రిప్రజెంటేటివ్‌గా ఉమర్‌షాద్, ఉత్తమ సార్జంట్ ఎట్ ఆర్మ్స్‌గా షాకీర్‌బాషాలను అవార్డులు వరించాయని తెలిపారు. అదేవిధంగా పట్టణంలో ప్రతిరోజూ ఉదయం వేళలో నిర్వహిస్తున్న జాతీయ గీతాలాపన కార్యక్రమానికి పబ్లిక్ ఇమేజ్ విభాగంలో మొదటి బహుమతి లభించిందని ఆయన తెలిపారు. అవార్డులు పొందిన వారిని ఆయన అభినందించారు.

కరాటే పోటీల్లో ప్రతిభ


ప్రతిభచాటిన విద్యార్థినులు

గుంతకల్లుటౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌జేపీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఆల్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్స్ 2025లో ప్రతిభ చాటారు. కర్ణాటకలోని గౌరిబిందనూరులో ఆదివారం నిర్వహించిన ఈ పోటీల్లో 8వ తరగతి విద్యార్థిని నాగేశ్వరి అండర్-14 విభాగంలో, పదో తరగతి విద్యార్థిని కే ఇందు అండర్-16విభాగంలో ద్వితీయ స్థానంలో నిలచారు. వీరిని పాఠశాల హెచ్‌ఎం కే మురళీకృష్ణ, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం గోపాల్‌రెడ్డి, పీడీలు వేణుగోపాల్, జ్యోతి, రాజేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎస్‌ఐఆర్‌ను అమలు చేయరాదు


డీటీకి వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

గుంతకల్లు టౌన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఓటు హక్కు హరించే ఎస్‌ఐఆర్‌ను అమలు చేయరాదని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. వలస వెళ్లినవారు, మైనార్టీలు, బలహీన వర్గాలు, పేదలు ఎవరైతే బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేస్తారో వారిని ఓటర్ లిస్ట్ నుంచి తొలగించడం జరుగుతోందన్నారు. ప్రాథమిక ఓటు హక్కును తొలగించరాదని డిమాండ్ చేశారు. డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతిప్రసాద్, సభ్యులు సాకే నాగరాజు పాల్గొన్నారు.

న్యాయం కోసం వినతి

పెద్దవడుగూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): తన పొలంలోని నీరు దిగువ కు వెళ్లకుండా మండలంలోని చిట్టూరు గ్రామానికి చెందిన రైతు శ్రీరాములు అడ్డుకట్ట వేశాడని, దీంతో నాలుగు ఎకరాల్లో సాగు చేసిన పత్తి పంటను తాను నష్టపోయానని అదే గ్రామానికి చెందిన బాల అంజనమ్మ వాపోయారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ ఉషారాణికి ఫిర్యాదుచేశారు. రెవెన్యూ అధికారులు పరిశీలించి తనకు న్యాయం చేయాలని కోరారు.